విశాలాంధ్ర

ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

శనివారం 05 ఏప్రిల్ 2025 8 పేజీలు



విద్యార్థులకు అందని శుద్ధజలం

- పాఠశాలల్లో అలంకారప్రాయంగా ఆర్వో ప్లాంట్లు
- లక్షలతో ఏర్పాటు... నిర్వహణ లేక నిరుపయోగం
- మరమ్మతులపై ఫిర్యాదులను పట్టించుకోని ఏజెన్సీలు

ఎండలు మండుతున్నాయి... ఒంటిపూట బడులు ప్రారంభమయ్యాయి. విద్యార్థులు ఎండవేడికి అల్లాడుతున్నారు. ఈ పరిస్థితులలో విద్యార్థులు డీహైడ్రేషన్‌కు గురికాకుండా పాఠశాలల్లో వాటర్ బెల్ అమలు చేయాలని ఇటీవల ప్రభుత్వం ఆదేశించింది. వేసవి తాపానికి గురికాకుండా విద్యార్థులకు గంటకోసారి మంచినీరు తాగేలా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని ఆదేశించింది. వాటర్ బెల్ కొట్టినా విద్యార్థులకు శుద్ధ జలం ఎలా అందించాలో తెలియక ఉపాధ్యాయులు తల పట్టుకుంటున్నారు. అనేక ప్రభుత్వ పాఠశాలల్లో వందల్లో విద్యార్థులు ఉన్న శుద్ధజలం అందుబాటులో లేదంటే ఆశ్చర్యం కాదు.

విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు: ఎండలతోపాటు వాతావరణంలో వేడి రోజుకు తీవ్రమవుతోంది. దీంతో పాఠశాలల్లో విద్యార్థులు ఇబ్బందులు పడ కుండా గంటకు ఒకసారి నీరు తాగేలా చూడాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇప్పటికే జిల్లాల పరిధిలోని పలు పాఠశాలల్లో తాగునీటి వసరులు అందుబాటులో లేవు. ఇళ్ల నుంచి తెచ్చుకుంటేనే ▶మిగతా 2లో..

రాజ్యాంగానికి విరుద్ధంగా మోదీ పాలన

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్

విశాలాంధ్ర - అమలాపురం : నరేంద్ర మోదీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని తోసిరాజని వక్ఫ్‌బిల్లు ఆమోదం పొందిందని, ఇది దేశంలో ముస్లిం మైనార్టీలకు నష్టదాయకమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్ పేర్కొన్నారు. సీపీఐ ప్రచార జాతాలో భాగంగా శుక్రవారం స్వాతంత్ర్యసమరయోధుడు సీపీఐ నేత కామ్రేడ్ చింతపల్లి కృష్ణమూర్తి స్మారక స్థూపం వద్ద ప్రచారజాతాను పార్టీ జిల్లా కార్యదర్శి కె. సత్తిబాబు ప్రారంభించారు. తొలుత సీనియర్ నాయకుడు పీతాని ఆనందరావు, కృష్ణమూర్తి స్మారక స్థూపానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన డేగా ప్రభాకర్ మాట్లాడుతూ ▶మిగతా 2లో..

ఉపాధి యూనిట్ల మంజూరుకు బ్యాంకర్లు కృషి చేయాలి

కలెక్టర్ షణ్మోహన్

విశాలాంధ్ర - కాకినాడ : జిల్లాలో వెనకబడిన తరగతుల వర్గాలకు స్వయం ఉపాధి యూనిట్ల మంజూరుకు బ్యాంకర్లు కృషి చేయాలని కలెక్టర్ షణ్మోహన్ కోరారు. జిల్లా వెనుకబడిన తరగతుల సేవా సంస్థ ద్వారా బీసీ, ఈడబ్ల్యుఎస్, కాపు కార్పొరేషన్ల కింద రుణాలు మంజూరుపై శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ షణ్మోహన్ బీసీ కార్పొరేషన్, జిల్లా పరిషత్, బ్యాంకు ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. వెనకబడిన తరగతుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా స్వయం ఉపాధి పథకాల మంజూరుకు బ్యాంకర్లు చేపట్టవలసిన చర్యలపై జిల్లా కలెక్టర్ అధికారులతో కలిసి చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ జిల్లాలో బీసీ కార్పొరేషన్, ఈడబ్ల్యూఎస్, కాపు కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధి యూనిట్ల మంజూరుకు సంబంధించి గత

మార్చి నెల 10నుంచి 25వ తేదీ వరకు లబ్దిదారుల ఆన్ లైన్‌లో దరఖాస్తు స్వీకరించగా సుమారుగా 57 వేలు దరఖాస్తులు అందినట్లు కలెక్టర్ తెలిపారు. స్వయం ఉపాధి యూనిట్లు, జనరిక్ మెడికల్ షాపులు, ఎంఎస్ ఎంఈ గ్రూపులకు, మేదర, కుమ్మరి, శాలివాహన వర్గాల వారికి ఆర్థిక సహాయం అందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 11న ▶మిగతా 2లో..

రాజ్యాంగాన్ని పరిరక్షించాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పిలుపు

విశాలాంధ్ర- ఉండి : రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పిలుపునిచ్చారు. రాజ్యాంగ పరిరక్షణ కోరుతూ భగత్ సింగ్ వర్ధంతి మార్చి 23 నుంచి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి ఏప్రిల్ 14 వరకు సీపీఐ జాతీయ సమితి పిలుపులో భాగంగా ఉండి మండలంలో రాజ్యాంగ పరిరక్షణ ప్రచార జాత మోటార్ సైకిల్ ర్యాలీ పాములపర్రు, కొండగూడెం, కోలమూరు, పాం దువ్వ, ఆరేడు, గ్రామాల మీదుగా శుక్రవారం జరిగింది. కోలమూరులో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి జాతా సభ్యులు ఘన నివాళులర్పించారు. ప్రచార జాత వెళ్లిన ప్రతి గ్రామంలో ప్రచార కరపత్రాలు

పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జిల్లా కార్యదర్శి భీమారావు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ రచించిన రాజ్యాంగానికి ప్రమాదం ఏర్పడిందని భీమారావు ఆవేదన వ్యక్తం చేశారు. మోదీ ప్రభుత్వం రాజ్యాంగానికి తూట్లు ▶మిగతా 2లో..

అర్హులందరికీ ఉపాధి హామీ పనులు

కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర -నరసాపురం: జాబ్ కార్డు పొందిన ప్రతి ఒక్కరికి ఉపాధి హామీ పనులు కల్పించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి డ్వామా అధికారులను ఆదేశించారు. శుక్రవారం నరసాపురం మండలం వేములదీవి తూర్పులో ఉపాధి హామీ పనులను, లక్ష్మణేశ్వరం హౌసింగ్ కాలనీని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న సమయంలో ఉపాధి కూలీలను కలెక్టర్ పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. పనులకు ఇబ్బంది ఏమైనా ఉందా, అవసరమైన వారికి పనులు కల్పిస్తున్నారా, డబ్బులు సకాలంలో జమ అవుతున్నాయా, ఉపాధి హామీ పనులు లేనప్పుడు వ్యవసాయ పనులకు వెళ్తారా అని ప్రశ్నించి సమాధానాలను తెలుసుకున్నారు. పనిలో నాణ్యత తప్పకుండా

ఉండాలని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాబ్ కార్డు పొంది, కోరిన ప్రతి ఒక్కరికి ఉపాధి హామీ పని కల్పించాలని డ్వామా అధికారులను ఆదేశించారు. వేములు దీవి ఈస్ట్ మురుగు బోదులు పూడికతీత పనులను ఉపాధి కూలీల ద్వారా 1500 మీటర్ల పరిధిలో చేపట్టడం జరిగిందని, ఈ పని నిమిత్తం అంచనా వ్యయం రూ.1.79 లక్షలుగా ఉండన్నారు. 80 మంది కూలీలు పనిచేస్తున్నారని 750 పనిదినాలను కల్పించామన్నారు. కార్యక్రమంలో భాగంగా లక్ష్మణేశ్వరం హౌసింగ్ లే అవుట్‌ను పరిశీలించిన సందర్భంలో వివిధ నిర్మాణ దశలలో ఉన్న ప్రతి ఇంటిని సందర్శించి లబ్ధిదారులు ఎక్కడ ఉంటున్నారు, ఎందుకు నిర్మాణాలు పూర్తి కాలేదు తదితర వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంలో కాలనీలో ఇప్పటికే నివాసం ఉంటున్న కొందరు మహిళలు కలెక్టర్‌తో మాట్లాడుతూ కాలనీకి రాకపోకలు సాగించే ఒక దారిని ఫెన్సింగ్‌తో మూసివేయడం కారణంగా నడకదారికి ఇబ్బందిగా ఉందని కలెక్టర్ ▶మిగతా 2లో..

ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

- రాష్ట్ర సహాయ కార్యదర్శి వై.బాబి
- మహాసభల గోడ పత్రిక ఆవిష్కరణ

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ జిల్లా పెద్దాపురం నియోజకవర్గం సామర్లకోట మండలం అచ్చంపేటలో అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభల గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి వై.బాబి మాట్లాడుతూ దేశంలో రోజురోజుకు నిరుద్యోగం పెరిగిపోతుందని అన్నారు. ప్రభుత్వ శాఖల్లో పోస్టులు ఖాళీగా ఉన్నా భర్తీ చేయడం లేదని, నోటిఫికేషన్లు లేక లక్షలాదిమంది నిరుద్యోగులు ఇనిస్టిట్యూట్లో కోచింగ్లు తీసుకుని తల్లిదండ్రులకు లక్షల రూపాయలు అప్పులు ▶మిగతా 2లో..

ధాన్యం అమ్మిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లోకి డబ్బు జమ

విశాలాంధ్ర - గణపవరం: రాష్ట్ర ప్రభుత్వం రైతుల అభివృద్ధి కోసం పెద్దపీట వేసిందని ఉంగుటూరు శాసనసభ్యులు పత్సమట్ల ధర్మరాజు అన్నారు. శుక్రవారం గణపవరం మండలం పిప్పర గ్రామంలోరైతు సేవా కేంద్రంలో రబీ

2024-25 కి సంబంధించి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.ఈ సందర్భంగా ధర్మరాజు మాట్లాడుతూ రైతు తనకు నచ్చిన రైస్ మిల్లును తానే ఎంచుకొని ధాన్యం పండించుకునే వెసులుబాటు ఉందన్నారు. రైతు ధాన్యాన్ని మిల్లునకు తోలిన తర్వాత మిల్లర్ లాగిన్‌లో అక్నాలెడ్జెంట్ అయిన 48 గంటల్లో రైతు ఆధార్‌కు అనుసంధాన మైన బ్యాంక్ ఖాతాలో ధాన్యం నగదు జమ చేస్తాం అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా వ్యవసాయాధికారి జెడ్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇ - పంట నమోదైన రైతులు తమ పంట అమ్ముటకు వాట్సప్ ద్వారా షెడ్యూల్ చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం ఏడిఏ పి.మురళీకృష్ణ, సివిల్ సప్లై డిప్యూటీ మేనేజర్ శివరాం ప్రసాద్, గణపవరం ఏవో ఎర్రంశెట్టి వెంకట సత్యనారాయణ ప్రసాద్, టిడిపి మండల అధ్యక్షులు ఇందుకూరి రామకృష్ణంరాజు, జనసేన తోట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వైద్య చికిత్స నిమిత్తం రూ.15 వేల ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : కొయ్యలగూడెం బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన కొవ్వలి సావిత్రి సుమారు ఐదు సంవత్సరాల నుండి తీవ్ర అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న జంగారెడ్డిగూడెం ప్రాంతీయ బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు చిలుకూరి సాయిబాబా, మోరపాకల రాధాకృష్ణ సింగపూర్‌కు చెందిన చేయూత సంస్థకు సిఫార్సు చేయగా వారు రూ.15 వేలు కొయ్యలగూడెం బ్రాహ్మణ యువశక్తి సంఘం ద్వారా ఆర్థిక సహాయాన్ని అందించారు. కొవ్వలి సావిత్రికి ఆర్థిక సహాయాన్ని అందించి బాసటగా నిలిచిన చేయూత సంస్థ ప్రతినిధులకు బ్రాహ్మణ యువశక్తి సంఘం వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ యువశక్తి అధ్యక్షులు గోదావరి శ్రీనివాస్ శర్మ ,కార్యదర్శి బొల్లాప్రగడ ప్రసాద్, ఉపాధ్యక్షులు మామిళ్ళపల్లి దుర్గా సీతారాం ,కోశాధికారి ఆచంట రవి, గౌరవాధ్యక్షులు చెట్లపల్లి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

7,8న కాపు, బిసిలకు ఇంటర్వ్యూలు

విశాలాంధ్ర -భీమవరం: ఈ నెల 7, 8, తేదీల్లో మున్సిపల్ కార్యాలయంలో కాపు, బిసి, వర్గాలకు రుణార్హతలకు సంబంధించి ఇంటర్వ్యూలు జరుగుతాయని మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇ.బి.సి కార్పొరేషన్ ద్వారా వ్యాపారాల నిమిత్తం సబ్సిడీ లోన్లు కోరుతూ ఆన్లైన్ చేసుకున్న అర్జీదారులు ఇంటర్వ్యూకు హాజరు కావాలని ఆయన సూచించారు.

కృషి చేయాలి (1వ పేజీ తరువాయి)

జ్యోతిబాపూలే జయంతి సందర్భంగా రుణాలు మంజూరు ప్రక్రియను ప్రారంభించనున్నదన్నారు. అందిన దరఖాస్తుల్లో 25 శాతం దరఖాస్తులకు ఈ నెల 11న రుణాలు మంజూరా చేసేలా బ్యాంకర్లు కృషి చేయాలని కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. సమావేశంలో డీఆర్వో జె. వెంకటరావు, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ. శ్రీనివాసరావు, జెడ్పీ సీఈవో లక్ష్మణరావు, డీసీసీబీ సీఈవో ఆర్వీ నరసింహారావు, బీ ఎల్డీఎం సీహెచ్‌వీస్వీ ప్రసాద్, వివిధ బ్యాంకుల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మోదీ పాలన

(1వ పేజీ తరువాయి)

భారత కమ్యూనిస్టు పార్టీ 2024 డిసెంబర్ 26 నాడు 99 వసంతాలు పూర్తిచేసుకుని శత వార్షికోత్సవాలు దేశవ్యాప్తంగా జరుపుకుంటోం దన్నారు. పార్టీ చేసిన త్యాగాలు, పోరాటాలు, ఆత్మ బలిదానాలు జాతీయ గణతికెక్కాయన్నారు. అందులో అంబేద్కర్ కోనసీమ జిల్లా సింహభాగం వుందని తెలిపారు. 19 మంది ఉద్యమ పోరాటంలో అమరులయ్యారని గుర్తు చేశారు. నాడు కాంగ్రెస్, కమ్యూనిస్టులు ఎన్నికల్లో తలపడినప్పుడు నేటి కోనసీమ జిల్లాలో ఇద్దరు ఎంపిలు, 6 గురు శాసన సభ్యులను కమ్యూనిస్టు పార్టీ తరఫున చట్టసభలకు పంపించారని తెలిపారు. ప్రచార జాతా అమలాపురం పట్టణంలో పలు కూడళ్లలో ఆపి ప్రజలను ఉద్దేశించి దేగా మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ అంశాలను వివరించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారతదేశంపై 27 శాతం పన్ను భారాన్ని వేశారని దాని ప్రభావం మొత్తంగా భారత్ ఆర్థిక వ్యవస్థ మీద ప్రభావితం అవుతుందని అన్నారు. ముఖ్యంగా వ్యవసాయ ఆధారిత ఉత్పత్తులు పైన బియ్యం, ఆక్వా-ఫిష్ పాడి పరిశ్రమ, ఆటోమొబైల్ రంగాలపై పడనున్నదని పేర్కొన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సాగుతున్న ప్రచార జాతాను జిల్లా ప్రజలు సాదరంగా ఆహ్వానించి జయప్రదం చేసి జిల్లా ప్రయోజనాలు కొరకు సూచనలు సలహాలు తెలపాలని సూచించారు. ఈ కార్యక్రమానికి సీపీఐ అమలాపురం నియోజకవర్గ కార్యదర్శి గూడాల వెంకటరమణ, జిల్లా కార్యవర్గ సభ్యులు నిమ్మకాయల శ్రీనివాసరావు, మండల కార్యదర్శులు కాళ్ల భీమరాజు, మోకా శ్రీనివాసరావు, పితాని ఆనందరావు నాయకత్వం వహించారు. పలువురు ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పార్టీ సభ్యులు హాజరయ్యారు.

జయప్రదం చేయండి

(1వ పేజీ తరువాయి)

మిగిలిస్తున్నారని పేర్కొన్నారు. మే 15, 16, 17, 18 తేదీల్లో తిరుపతిలో జరగబోయే ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభల్లో దేశం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున నిరుద్యోగ యువత పాల్గొంటున్నారని అన్నారు. ఈ మహాసభలను ప్రతి ఒక్కరూ జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మాజీ జిల్లా అధ్యక్షులు గరగా బాబ్జి, కాకినాడ జిల్లా సహాయ కార్యదర్శి, ఎం.వీరబాబు, బోండా మైకెల్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులు (1వ పేజీ తరువాయి)

దృష్టికి తీసుకు వచ్చిన వెంటనే స్పందిస్తూ సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆర్డీవోను ఆదేశించారు. కాలనీలో తాగునీరు, డ్రైనేజీ, తదితర సమస్యలు ఉన్నాయని నివాసితులు కలెక్టర్ కు విన్నవించారు. ఈ సందర్భంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఆర్డీవో దాసిరాజు, డ్వామా పిడి డాక్టర్ కే సిహెచ్ అప్పారావు, జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి జి.పిచ్చయ్య, ఇంచార్జ్ తహసీల్దార్ ఐ వి వి సత్యనారాయణ, ఎంపీడీవో జీవీఎస్ కృష్ణంరాజు, సర్పంచ్ వెంకటేశ్వరరావు, డ్వామా ఏపీవో శ్రీనివాస్, గృహ నిర్మాణ శాఖ ఈఈ ఎం.శ్రీనివాస్, డిఈ ఆర్.త్రిమూర్తులు, తదితరులు ఉన్నారు.

పరిరక్షించాలి (1వ పేజీ తరువాయి)

పొడుస్తుందని విమర్శించారు. భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని పిలుపునిచ్చారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయడం సిగ్గుచేటు అన్నారు. కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్నారని విమర్శించారు. స్వామినాథన్ సిఫారసులు అమలు చేయడంలో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నా రని అన్నారు. 46 కార్మిక చట్టాలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ పరిరక్షణకు ఈనెల 14వ తేదీ వరకు సిపిఐ చేపట్టిన ప్రచార జాతాలో కార్మికులు, శ్రామికులు, కర్షకులు, ప్రజలు, భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఉండి మండల కార్యదర్శి కలిశెట్టి వెంకట్రావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సీతారాం ప్రసాదు, జిల్లా సమితి సభ్యులు సన్నపాల శ్రీను, కోన గొల్లయ్య, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి తమ్మరుసు శ్రీనివాసు, శాఖా కార్యదర్శులు ఉండి వీరభద్రరావు, నీతుడి శ్రీను, ఒంటెద్దు వెంకన్న, దుర్గారావు, దువ్వాని సీతారాముడు, తదితరులు పాల్గొన్నారు.

శుద్ధజలం (1వ పేజీ తరువాయి)

తాగునీరు అన్న పరిస్థితి ఉంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో నాడు-నేడు పథకంలో ఆర్. ఓ.ప్లాంట్ ఏర్పాటు చేశారు. అది మూణ్నాళ్ల ముచ్చటగానే పనిచేశాయి. ఏర్పాటుచేసిన కొన్ని రోజులకే ఆర్వో ప్లాంట్లు మూలనపడ్డాయి. వాటి మరమ్మతుల గురించి పట్టించు కునే వారే లేరు. అటు అధికారులు.. ఇటు సంబంధిత ఏజెన్సీలవారు ఆర్వో ప్లాంట్ల గురించి పట్టించుకోవడం లేదు. దీంతో పాఠశాలల్లో తాగునీటి సౌకర్యం లేక విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు కూడా తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన ఆర్ఓ ప్లాంట్ల నిర్వహణ సక్రమంగా లేక మూతపడ్డాయి. ఈ పరిస్థితులలో పాఠశాలల్లో దొరికే నీరు శుభ్రంగా లేకపోవడంతో కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులే చందాలు వేసుకుని మినరల్ వాటర్ క్యాన్లను కొనుగోలు చేసి విద్యార్థులకు అందిస్తున్నారు. మరి కొందరు విద్యార్థులు తప్పనిసరి పరిస్థితులలో పాఠశాల బయట దొరికే నీటిని కొనుగోలు చేసి తాగుతున్నారు. పాఠశాలల్లో బోధన గురించి పక్కన పెడితే విద్యార్థులకు కనీస అవసర మైన నీటిని గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులు ఇళ్ల నుంచి తెచ్చు కున్న నీటిని వినియోగిస్తు న్నారు. ఆ నీరు అయిపోతే విద్యార్థులు బయటకు వెళ్లి కొనుగోలు చేసుకోవాల్సివస్తోంది. లేదంటే ఇంటికి వెళ్లే వరకు దాహార్తితో అల్లాడిపోవాల్సిందే. ఉదయం గం.10,11,12 గంటలకు వాటర్ బెల్‌ను ఎలా అమలు చేయాలని ఉపాధ్యాయులు సతమతమవు తున్నారు.

రూ..లక్షలతో ఏర్పాటు... ఫలితం శూన్యం...

2020లో నాడు-నేడు పథకంలో విద్యార్థులకు సురక్షిత తాగునీరు అందించేందుకు పాఠశాలల్లో ప్రత్యేకంగా ఆర్వో ప్లాంట్లను మంజూరు చేశారు. ఒక్కో వాటర్ ప్లాంట్ 50 వేల లీటర్లు, లక్షరెండు లక్షల లీటర్ల సామర్థ్యంతో కొనుగోలు చేశారు. సరఫరా, బిగించడం, నిర్వహణ కోసం ఒక్కో పాఠశాలకు రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఖర్చు చేసినట్లు సమాచారం. ఏజెన్సీలు అనేక చోట్ల ప్లాంట్లు పంపిణీ చేసి వాటిని బిగించలేదు. వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు షెడ్డు నిర్మాణం చేయకుండానే యంత్రాలను తీసుకువచ్చి పాఠశాలల్లో పెట్టారు. తర్వాత షెడ్డు నిర్మించినా వాటిని బిగించకుండా మూలన పడేసారు.మరికొన్నిచోట్ల నిర్వహణ లోపంతో వాడుకలోనికి తీసుకురాలేదు. ఫలితంగా పాఠశాల లలో శుద్ధ జల యంత్రాలు ఎందుకు పనికిరాకుండా ఉన్నాయి. మరమ్మతులపై పాఠశాలల కమిటీ సభ్యులు, ప్రధానోపాధ్యాయులు, సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకునే వారే లేరు.ప్రభుత్వం తాజాగా ఆరో ప్లాంట్ల విషయాన్ని తెలుసుకుని స్కూల్ గ్రాండ్ నిధులను విడుదల చేయడంతో కొన్ని పాఠశాలలలో మాత్రం ఆరో ప్లాంట్లు అందుబాటులోకి వచ్చాయి. మిగిలిన పాఠశాలలలో మాత్రం పరిస్థితి మామూలుగానే ఉంది. ప్రభుత్వం ఇకనైనా స్పందించి విద్యార్థులకు స్వచ్ఛమైన నీరు అందించే ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ముస్లింల నిరసన

విశాలాంధ్ర -భీమవరం: వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగ విరుద్ధమని ఫెడరల్, లౌకిక వాదానికి గొడ్డలిపెట్టని ముస్లిం పెద్దలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంటులో ఎన్డీఏ ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లును ఆమోదించుకున్న

తీరును నిరసిస్తూ శుక్రవారం భీమవరంలో ముస్లిం సమాజం పెద్ద ఎత్తున భారీ ర్యాలీ నిర్వహించి ప్రకాశం చౌక్‌లో ఆందోళన నిర్వహించింది. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు మాట్లాడుతూ ముస్లింలతో మాటమాత్రం కూడా సంప్రదించకుండా సవరణ బిల్లును తీసుకు రావడం దారుణమని ధ్వజమెత్తారు. ముస్లింల హక్కులను, రాజ్యాంగ స్వేచ్ఛను బిల్లు రూపంలో హరించారని నాయకులు విమర్శిస్తున్నారు. వక్ఫ్ సవరణ బిల్లుకు లౌకిక ముసుగులో మద్దతిచ్చిన టిడిపి,జనసేనలను నాయకులు తూర్పారబట్టారు. తొలుత తహశీల్దార్ రావి రాంబాబుకు వినతిపత్రం నాయకులు అందచేశారు. కార్యక్ర మంలో షేక్ రబ్బానీ, ఖలీలుద్దీన్, సిద్దిఖ్, అస్లాం తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర -లింగపాలెం: అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని వేములపల్లిలో నిర్వహించే క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్ను ఎమ్మెల్యే సొంగ రోషన్ కుమార్

ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఈయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో క్రికెట్ పోటీలను నిర్వహించ చడం అభినంద నీయమని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో క్రీడలను అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. వేములపల్లిలో ఈఏడాది నిర్వహించే క్రికెట్ పోటీలలో విన్నర్ టీంకు రూ.1 లక్ష,రన్నర్ టీంకు రూ.40వేలు,మ్యాన్ ఆఫ్ ద సిరీస్ అందుకున్న క్రీడాకారునికి రూ.12 వేలు నగదు అందిస్తున్నట్లు పోటీల నిర్వాహకులు నాగేంద్ర తెలిపారు.

బయటపడిన మృతదేహం

విశాలాంధ్ర - జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని నాగులగూడెం ఎర్రకాలువ జలాశయంలో గురువారం బసవయ్య అనే వ్యక్తి గల్లంతయ్యాడు.

స్థానికులు, పోలీసులు కథనం ప్రకారం లక్కవరం గ్రామానికి చెందిన చల్లా బసవయ్య (75) వ్యవసాయం చేసుకుంటూ, పశువులను మేపుతుంటాడు. గురువారం సాయంత్రం పశువులను కడగడానికి నీటిలో దిగి పశువులను కడుగుతుండగా దిగిన చోట లోతు ఎక్కువగా ఉండటంతో ఊబిలో కూరుకుపోయాడు. లక్కవరం ఎస్ఐ డి. శశాంక్ గురువారం రాత్రి నుండి గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం ఉదయం మృతదేహం లభ్యమైంది. బయటకు తీసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై శశాంక్ తెలిపారు.

పరిశోధనాత్మక ప్రాజెక్టులు చేపట్టాలి

విశాలాంధ్ర -భీమవరం: సమాజానికి చేరువయ్యే పరిశోధనాత్మక ప్రాజెక్టులు చేపట్టాలని ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతి రాజు

పేర్కొన్నారు. కళాశాల ఈసీఈ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో ఐ ఈ టి ఈ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో " క్రక్స్ 2కె25 " పేరిట శుక్రవారం హార్డ్వేర్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చేపట్టిన ప్రాజెక్టులు భవిష్యత్తులో వాటిని మరింతగా ఆధునీకరించి నూతన టెక్నాలజీని జోడిస్తే విద్యార్థులు స్టార్టప్ పెట్టే స్థాయికి ఎదుగుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.మురళీకృష్ణంరాజు, ఈసీఈ హెడ్ డాక్టర్ ఎన్.ఉదయ్ కుమార్, క్రాక్స్ ఫ్యాకల్టీ అడ్వైజర్ డాక్టర్ టి.హైమలక్ష్మి, కోఆర్డినేటర్ డాక్టర్ కే.ఎన్.వి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య

విశాలాంధ్ర-చింతలపూడి: విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలంటే చదువుతోనే సాధ్యం అని చింతలపూడి నియోజకవర్గ శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ అన్నారు. చింతలపూడి పట్టణంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ముందు చూపుతో ఇంటర్మీడియట్ విద్యార్థులకు వేసవి సెలవులలో సమయం వృధా కాకుండా వచ్చే విద్యా సంవత్సరానికి ముందే పుస్తకాలు ఆయా కాలేజీలకు అందజేయటం హర్షణీయమన్నారు. దీని ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని తెలిపారు. ఈ సందర్భంగా శాసన సభ్యులు కాలేజీ విద్యార్థులకు టెక్స్ట్ బుక్స్ అందించారు.ఈ కార్యక్రమం లో కాలేజీ ప్రిన్సిపాల్, భోధనాధ్యపక సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

శాంతి, ప్రేమ, మానవాళి మనుగడకు ప్రతిరూపం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : ప్రేమ, శాంతి, మానవాళి మనుగడకు ప్రతిరూపం ఏసుక్రీస్తు మార్గము అని రోమన్ క్యాథలిక్ గవరవరం విచారణ గురువులు ఆనంద్ భాస్కర్ పేర్కొన్నారు. మండలంలో కన్నాయిగూడెం గ్రామంలో ఆర్.సి.యం చర్చ్ ఆధ్వర్యంలో సిలువ మార్గం నిర్వహించారు. క్రైస్తవ సోదరులు చేస్తున్న 40 రోజుల ఉపవాస సిలువ ధ్యాన దీక్షలలో భాగంగా కన్నాయిగూడెం గ్రామంలో నిర్వహించిన సిలువ మార్గంలో క్రైస్తవ సోదరులు, పురవీధులలో యేసు క్రీస్తు విశిష్టతను తెలియజేస్తూ ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ఫాదర్ ఆనంద్ మాట్లాడుతూ ప్రేమ, శాంతి, కరుణ లకు ప్రతిరూపం ఏసుక్రీస్తు అని, లోక రక్షణ కొరకు ఏసుక్రీస్తు మానవాళిగా జన్మించి, పాపులను రక్షించడం కోసం సిలువ వేయబడ్డారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయక గురువులు అరుణ్,ఉపదేశకులు అనిల్, సింగ్ , జేసుదాసు, కండెల్లి శివ, రాజు కిషోర్, కళ్యాణ్, మధు, సంఘ పెద్దలు, విశ్వాసులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ మృతి

విశాలాంధ్ర- పాలకోడేరు : పాలకోడేరు మండలం శృంగ వృక్షం గ్రామానికి చెందిన పోలీస్ కానిస్టేబుల్ సిహెచ్ వెంకటేశ్వరరావు(37) ఆకస్మికంగా మృతి చెందారు. ప్రస్తుతం ఆకివీడు పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తూ అనారోగ్య కారణం వల్ల స్వగ్రామమైన శృంగవృక్షంలో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. గురువారం అర్ధరాత్రి కాల కృత్యాలు తీర్చుకునే క్రమంలో బాత్రూంలోకి వెళ్లి ఎంతసేపటికి రాకపోవడంతో వెంటనే ఆయన భార్య వెళ్లి చూడగా స్పృహ తప్పి ఉండడంతో దగ్గరలో ఉన్న ఆర్.ఎం.పి వైద్యున్ని పిలిపించి చూపించగా ఆయన మృతి చెందినట్లు తెలిపారు. తదనంతరం మృతి భార్య కనకదుర్గ ఫిర్యాదు మేరకు శుక్రవారం పాలకోడేరు సబ్ ఇన్స్పెక్టర్ మంతెన రవి వర్మ అనుమానస్పద మృతిగా నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నరసాపురాన్ని పరిశుభ్రంగా ఉంచాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర -నరసాపురం: నరసాపురం ప్రాంత ప్రజలు పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో చైతన్యవంతులు కావాలని, అధికారులు, ప్రజాప్రతినిధులు చెత్త నిర్మూలనకు కృషి చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి పిలుపునిచ్చారు. శుక్రవారం నరసాపురం మున్సిపల్ కార్యాలయంలో కలెక్టర్ చదలవాడ నాగరాణి అధ్యక్షతన "పరిశుభ్ర నరసాపురం" కు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు, ప్రజా ప్రతినిధులు, శానిటరీ వర్కర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నరసాపురం డంపింగ్ పెద్ద సమస్యగా మారిందని, గోదావరి నది ఒడ్డున డంపింగ్ చేయడంతో భూమి, వాయు, నీరు కాలుష్యం అవుతున్నాయని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ పరిశీలించి అభ్యంతరాన్ని వ్యక్తం చేస్తూ చర్యలకు పూనుకున్న సందర్భంలో, కొంత సమయాన్ని అడిగి తాత్కాలికంగా చర్యలను నిలుపుదల చేసుకున్నట్లు తెలిపారు. ప్లాస్టిక్ వ్యర్థాలు, పెద్ద ఎత్తున చెత్త గోదావరి ఒడ్డున డంపింగ్ చేయడం వలన గోదావరి పెరిగితే నదిలో కలిసిపోవడం, లేని పక్షంలో పట్టణాన్ని ముంచెత్తడం జరుగు తాయని ఇవి పెద్ద అనారోగ్యకరమైన అనర్థాలకు దారితీస్తాయన్నారు. క్యాన్సర్, మూత్ర పిండాలు, ఊపిరితిత్తులు వంటి వ్యాధులకు గురవుతున్నారని వివిధ పరిశోధనలలో తేలిందన్నారు. పశువులు డంపింగ్ చేసిన ప్రాంతంలో తినడం వలన చెత్తలో ఉన్న ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు, బ్లేడ్లు, ఇనుప వస్తువులు తదితర పదార్థాలు జంతువులకు పెద్ద హాని చేస్తున్నాయని తెలిపారు. నరసాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు ఇంటిం టికి వెళ్లి పెద్ద ఎత్తున అవగాహన కల్పించా లని తెలిపారు. తడి చెత్త,

పొడి చెత్త వారి ఇంటిలోనే వేరు చేసే ఇచ్చేలా ప్రోత్సహించా లన్నారు. డంపింగ్ యార్డ్‌కు అవసరమైన స్థల సేకరణలో ప్రతిఒక్కరు సహాయ సహకారాలను అందించాలన్నారు. ప్రజా ప్రతినిధులుగా పరిశుభ్ర నరసాపురం గా రూపుదిద్దిందేందుకు తమ వంతు సహ కారం ఎల్లప్పుడు అందిస్తామని ఈ సందర్భంగా తెలిపారు. జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ చెత్త రహిత నరసాపురంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన ప్రణాళికలను ముందుస్తుగా సిద్ధం చేయాలని సూచించారు. ప్రతిరోజు ఎంత చెత్తను సేకరిస్తున్నారు, ఎంత వేరు చేయాలి శానిటరీ సెక్రటరీలు ఇంటింటికి అవగాహన కల్పించా లన్నారు. సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌తోనే 30 శాతం డంపింగ్ నిండిపోతుందని, చెత్తను ఎక్కడబడితే అక్కడ వేయకుండా పర్యవేక్షించేందుకు టీమ్స్‌ను నియమించాలని సూచించారు. సమావేశంలో నరసాపురం ఆర్డీవో దాసిరాజు, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ బర్రె శ్రీ వెంకటరమణ, వైస్ చైర్ పర్సన్ కామన నాగిణి, కార్పొరేటర్లు బొమ్మిడి సూర్యకుమారి, తదితరులు పాల్గొన్నారు.

ధర్మాజీగూడెం పంచాయతీలో అవకతవకలపై విచారణ చేయించాలి

విశాలాంధ్ర-లింగపాలెం: ధర్మాజీగూడెం పంచాయతీలో జరిగిన అభివృద్ధి పనులలో అవకతవకలు జరిగాయని, దీనిపై కలెక్టర్‌తో విచారణ చేయించా లని మండల పరిషత్ ఉపాధ్య క్షుడు మట్టా సురేష్ లింగపాలెం మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో అధికారు లను కోరారు. పంచాయతీలో నిధులు సమృద్ధిగా ఉన్నా అభివృద్ధి జరగటం లేదని ఉపాధ్యక్షుడు పేర్కొన్నారు. మండల పరిషత్తు నిధులనుంచి అభివృద్ధి పనుల కోసం రూ.10 లక్షలు మంజూరు చేస్తే ఈ పనులకు సంబంధించి పంచాయతీ తీర్మానాలు ఇవ్వాల్సి ఉండగా తీర్మానాలు ఇవ్వటం లేదన్నారు. గ్రామంలో డ్రైన్ నిర్మించి రహదారి నిర్మించినట్లు నమోదు చేశారని ఈ పనిపై అభ్యంతరాలు, అనుమానాలు ఉన్నా యని ఉపాధ్యక్షుడు సమావేశంలో పేర్కొన్నారు. పంచాయతీలో మూడువేల డస్ట్ బిన్లు పంపిణీ చేసినట్లు పంచాయతీ వారు చెప్పుతున్నారని వీటి పంపిణీ సక్రమంగా జరగలేదని ఆయన అన్నారు. ధర్మాజీగూడెం పంచాయతీలో జరిగిన పనులన్నింటిపై కలెక్టర్ విచారణ చేయించేలా చర్యలు తీసుకోవాలని

కోరారు. ఉపాధ్యక్షుడు చేసిన ఆరోపణలపై మండల పంచాయతీ విస్తరణ అధికారి రత్నకుమార్ మాట్లాడుతూ ఈ ఆరోపణలపై దర్యాప్తు చేయిస్తా మని హామీ ఇచ్చారు. సమావేశంలో ఎంపీడీవో వాణి మాట్లాడుతూ వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా తీసుకునే చర్యలను వివరించారు. ప్రజా ప్రతినిధులు, రైతులు ప్రజలు భాగస్వాములుగా ఉండి నీటిఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో 24 ప్రభుత్వశాఖల పనితీరుపై సమీక్ష చేశారు. సమావేశానికి మండల పరిషత్ అధ్యక్షురాలు ముసునూరు వెంకటలక్ష్మి అధ్యక్షత వహించారు. సమావేశంలో మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

'రాక్‌ఫిల్ డ్యామ్' పనులకు శ్రీకారం

విశాలాంధ్ర-పోలవరం: పోలవరం ప్రాజెక్ట్‌లో కీలకమైన గ్యాప్-1 రాక్‌ఫిల్ డ్యామ్ పనులకు గురువారం శ్రీకారం చుట్టారు. జలవనరుల శాఖ, పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ పీపీఏ, మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్

ఎంఈఐఎల్ అధికారులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాక్ ఫిల్ డ్యామ్‌ను 25 మీటర్ల ఎత్తు... 540 మీటర్ల పొడవున నిర్మిస్తారు. అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతి నిధులు మాట్లాడుతూ నిర్ణీత గడువులోగా ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు ప్రణాళికా బద్ధంగా పనులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పోలవరం ప్రాజెక్టు సీఈ కె.నరసింహమూర్తి, ఎస్ఈ రెడ్డి రామచంద్రరావు, ఈఈ కె.బాలకృష్ణ, పీపీ ఎ.సి.ఈ.రమేష్ కుమార్, ఎం.ఈ.ఐ.ఎల్. జాయింట్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సతీష్‌బాబు అంగర, జి.ఎం.గంగాధర్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో గుండెపోటుతో వ్యక్తి మృతి

విశాలాంధ్ర-టి.నరసాపురం: ఏపీఎస్ఆర్టీసీ బస్సులో గుండెపోటుతో వ్యక్తి మృతి చెందిన సంఘటన రాజుపోతే పల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కె జగ్గవరం గ్రామానికి చెందిన కొక్కుల సోమేశ్వరరావు (60) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. శుక్రవారం తన భార్యను

వెంటబెట్టుకొని జగ్గవరం నుండి ఏలూరు డిపోకు చెందిన ఏపీఎస్ ఆర్టీసీ ఏపీ 16 జెడ్ 0031 బస్సులో హాస్పటల్‌కు బయలుదేరారు. మార్గమధ్యంలో రాజు పోతేపల్లి సెంటర్ వద్దకు వచ్చిన తర్వాత ఒక్కసారిగా గుండెపోటు రావడంతో బస్సులో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, కుమార్తె, కుమారుడు వున్నారు.

మెగా డి.ఎస్.సి -2025కు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్

విశాలాంధ్ర - ఏలూరు: ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం, బి.సి. సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మెగా డి.ఎస్.సి -2025 పరీక్షలకు టెట్‌లో అర్హత సాధించిన బి.సి, ఇ.డబ్ల్యు.ఎస్ (ఇ.బి.సి) అభ్యర్థులకు ఉచిత ఆన్లైన్ డి.ఎస్.సి శిక్షణ కొరకు, ఇంటి వద్దనుంచే ఆన్లైన్ డి.ఎస్.సి కోచింగ్ ను పొందుటకు ఏలూరు జిల్లా కు చెందిన అర్హులైన అభ్యర్థులు వారి 10వ తరగతి,ఇంటర్,డిగ్రీ,టిటిసి, బి.ఎడ్,కుల,ఆదాయ నివాస ధృవ పత్రములు,ఆధార్ కార్డ్,2-పాస్ పోర్ట్ సైజ్ ఫోటోస్,టెట్ లో అర్హత సాదించిన మార్కుల జిరాక్స్ కాపీలతో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా బి.సి. సంక్షేమ అధికారి ఆర్.వి. నాగరాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.పూర్తి చేసిన దరఖాస్తులను అభ్యర్థులు స్వయంగా జిల్లా బి.సి.సంక్షేమం, సాధికారిత అధికారి, కలెక్టరేట్ కాంపౌండ్, ఏలూరు వారి కార్యాలయంలో సమర్పించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వారు కల్పించిన ఈ సదవకాశం ఏలూరు జిల్లా అభ్యర్థులు ఉపయోగించుకోవాలని, ఇతర వివరములకు ఫోన్:8686180018 ద్వారా సంప్రదించవచ్చన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో ఉండాలి

విశాలాంధ్ర-లింగపాలెం: విద్యార్థులు క్రమశిక్షణతో ఉండాలని దీనివల్ల అన్ని రంగాలలో విద్యార్థులు అభివృద్ధి సాధిస్తారని మండల విద్యా శాఖ అధికారి రామారావు అన్నారు. ధర్మాజీ గూడెంలోని శ్రీవిద్య పాఠశాల వార్షికోత్సవం కన్నుల పండువగా జరిగింది. విద్యార్థులు

సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ పాఠశాల పనితీరును అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ చలసాని సాయి సునంద రత్నాకర్ పాల్గొన్నారు.

నేడు బాబు జగ్జీవన్‌రామ్ జయంతి

విశాలాంధ్ర-ఏలూరు: డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 117వ జయంతి ఈనెల 5వ తేదీ శనివారం ఏలూరులో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం గం.10లకు స్థానిక ఫైర్ స్టేషన్ సెంటర్ వద్దనున్న బాబు జగ్జీవన్ రామ్ కాంస్య విగ్రహానికి పూలమాలాంకరణ జరుగుతుందని, అనంతరం 10. 30 ని.లకు జిల్లా కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశపు హాలులో సభా కార్యక్రమం జరుగుతుందని, కార్యక్రమాలలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారన్నారు.

ప్రజలు ఈ కార్యక్రమాలలో పాల్గొనవలసిందిగా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు

విశాలాంధ్ర -గణపవరం: మత సామరస్యానికి విఘాతం కల్గించే మతోన్మాద శక్తులపై ఉక్కు పాదం మోపాలని, సీబీఐ, ఈడీ, ఎలక్షన్ కమీషన్, న్యాయవ్యవస్థ లాంటి రాజ్యాంగ స్వయం ప్రతిపత్తి సంస్థల్లో ప్రభుత్వ జోక్యం లేకుండా స్వతంత్రంగా పనిచేసే స్వేచ్ఛ కల్పించాలని, స్వేచ్ఛా, స్వాతంత్ర్యం,సమానత్వం, సౌభ్రాతృత్వం లక్ష్యంగా ఆవిర్భవించిన భారత రాజ్యాంగం కేంద్ర ప్రభుత్వం మతతత్వ పాలన కారణంగా ప్రమాదంలో వుందని బీజేపీ పాలనలో లౌకికవాదం, మానవ హక్కులకు ప్రమాదం ఏర్పడిందని, రాజ్యాంగ లక్ష్యాలు నెరవేర్చడానికి, ప్రజాస్వామ్య మనుగడకు, రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పిలుపునిచ్చారు. మార్చి 23 భగత్ సింగ్ వర్ధంతి నుంచి ఏప్రియల్ 14 అంబేద్కర్ జయంతి వరకు రాజ్యాంగాన్ని పరిరక్షించాలని కోరుతూ సిపిఐ జాతీయ సమితి ఇచ్చిన పిలుపులో భాగంగా శుక్రవారం గణపవరం మండలంలో రాజ్యాంగ పరిరక్షణ ప్రచార యాత్రను సిపిఐ నిర్వహించింది. ఈ సందర్భంగా పలు కూడళ్లలో కోనాల భీమారావు మాట్లాడుతూ గత పదకొండేళ్లుగా దేశంలో మోడీ పాలనలో ప్రజాస్వామ్యం మంటకలిసిపోతుందని, మోడీ పరివారం రాజ్యాంగంపై దాడి చేస్తున్నారని, లౌకిక వ్యవస్థకు తూట్లు పొడుస్తున్నారని, రాజ్యాంగం అమలు ప్రశ్నార్థకంగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలకుల అరాచకాలను ప్రశ్నిస్తున్న జర్నలిస్టు గౌరీ లంకేష్, దభోల్కర్, గోవింద పన్సారే, కల్బుర్గి వంటి ప్రజాస్వామ్యవాదులను హత్యలు చేస్తున్నారని, నల్లసాగు చట్టాలు తెచ్చి రైతులకు సంకెళ్లు వేస్తున్నారని, నాలుగు లేబర్ కోడ్లు పేరుతో కార్మికుల హక్కులు కాలరాస్తున్నారని వారి ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని భీమారావు పేర్కొన్నారు. ఏప్రియల్ 14 వరకు సిపిఐ చేపట్టిన రాజ్యాంగ పరిరక్షణ ప్రచార కార్యక్రమల్లో ప్రజలు భాగం పంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కలిశెట్టి వెంకట్రావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. సీతారాం ప్రసాద్, జిల్లా సిపిఐ సమితి సభ్యులు మండల నాగేశ్వరరావు, సనపల శ్రీనివాస్, కోన గొల్లయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తమరాని శ్రీనివాస్, తాడేల వాసు పెనుగంటి శ్రీను ఇసుకల సత్యనారాయణ పెరుమటి సత్యం, పిల్లా శ్రీనివాసరావు, బందారు సూరిబాబు, అందూరి త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ఎంఈఓలు కృషి చేయాలి

విశాలాంధ్ర- ఉంగుటూరు : ఎంఈఓలు అందరూ విద్యాభివృద్ధికి కృషి చేసి విద్యార్థుల భవిష్యత్తును మెరుగుపరచడానికి, సమాజానికి మంచి పౌరులు గా తీర్చిదిద్దాలని ఉంగుటూరు ఎమ్మెల్యే ధర్మరాజు అన్నారు. శుక్రవారం ఉంగుటూరు నియోజకవర్గ శాసనసభ్యుల వారి క్యాంపు కార్యాలయం వద్ద నియోజకవర్గ నాలుగు మండలాల విద్యాశాఖ అధికారులతో ఎమ్మెల్యే ధర్మరాజు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాబోయే విద్యా సంవత్సరం నాటికి పాఠశాలల్లో మెరుగైన రీతిలో మౌలిక వసతులను కల్పించేందుకు అవసరమైన ప్రణాళికలు ఇప్పటి నుంచే రూపొందించాలన్నారు. భవనాల నిర్మాణం, రుచికరమైన భోజన సదుపాయం ఇతర సౌకర్యాలను కల్పిస్తూ విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా వారికి నాణ్యమైన విద్యను అందించాలని అన్నారు. ప్రైవేటు పాఠశాల కన్నా ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందిస్తున్నామని విషయాన్ని విద్యార్థులు తల్లిదండ్రులకు వివరించవలసిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యా బలం పెరిగే విధంగా కృషి చేయాలన్నారు. ఉంగుటూరు, నిడమర్రు, గణపవరం, భీమడోలు మండలాల ఎంఈఓలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా టెన్త్ స్పాట్ వాల్యుయేషన్

డీఈవో వెంకట లక్ష్మమ్మ

విశాలాంధ్ర -ఏలూరు: జిల్లా కేంద్రమైన ఏలూరులోని సెయింట్ జేవియర్ హైస్కూల్లో టెన్త్ స్పాట్ వాల్యుయేషన్ కార్యక్రమం ప్రశాంతంగా జరుగుతోందని డీఈవో ఎం. వెంకట లక్ష్మమ్మ తెలిపారు. అన్ని సబ్జెక్టులకు కలిపి 1,85,500 స్క్రిప్టులు వాల్యుయేషన్‌కి వచ్చాయని అన్నారు.గురు,శుక్రవారాల్లో సుమారు 20 వేలకు పైన పేపర్లు వాల్యుయేషన్ పూర్తి అయ్యిందని చెప్పారు. ఈనెల తొమ్మిదో తేదీ వరకు స్పాట్ వాల్యుయేషన్ కార్యక్రమం ఉంటుందన్నారు. డిఈఓ స్పాట్ వాల్యుయేషన్ క్యాంపు ఆఫీసర్‌గా,ప్రభుత్వ పరీక్షల నిర్వహణ అసిస్టెంట్ కమిషనర్ శ్రీకాంత్, జంగారెడ్డిగూడెం ఎంఈఓ సురేష్‌లు డిప్యూటీ క్యాంపు ఆఫీసర్లుగా వ్యవహరిస్తారని డీఈవో చెప్పారు. 115 మంది చీఫ్ ఎగ్జామినర్లు, 690 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు, 223 మంది స్పెషల్ అసిస్టెంట్లు కలిపి సుమారు ఎనిమిది వందలకు పైగా సిబ్బంది విధులను నిర్వర్తిస్తున్నారని డిఈఓ చెప్పారు.తెలుగు సబ్జెక్టుకు 124 మంది ఉపాధ్యాయులను, హిందీ సబ్జెక్టుకు 109 మంది, ఇంగ్లీషు సబ్జెక్టుకు 83,మంది లెక్కలు సబ్జెక్టుకు 48,మంది భౌతిక శాస్త్రం నకు 84 మంది,బయాలజీకి 108 మంది,సోషల్ స్టడీస్ కి 107 మంది, సంస్కృతం సబ్జెక్టుకు 15 మంది,ఒకేషనల్ కోర్సుకు 12 మంది ఉపాధ్యాయులను అసిస్టెంట్ ఎగ్జామినర్లుగా నియమించినట్టు తెలిపారు. వీరందరికీ మెడికల్ క్యాంపుతో పాటు ప్రాథమిక సౌకర్యాలు అన్నింటిని ఏర్పాటు చేసినట్టు డీఈఓ వెంకట లక్ష్మమ్మ తెలిపారు.

విపత్తు నివారణదళం మాక్‌డ్రిల్

విశాలాంధ్ర -వేలేరుపాడు: ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఎటువంటి ప్రాణ నష్టం కలగకుండా తీసుకోవలసిన జాగ్రత్త చర్యలపై వేలేరుపాడు మండలం చిగురుమామిడి గ్రామంలో శుక్రవారం రాష్ట్ర విపత్తు నివారణ దళం సభ్యులు ప్రదర్శన (మాక్ డ్రిల్) నిర్వహించారు. తుఫానులు, వరదల వంటి ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రాణ నష్టాన్ని నివారించేందుకు జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు రాష్ట్ర విపత్తు నివారణ దళం సిబ్బందితో ఆయా ప్రాంతాల ప్రజలకు అవగాహన కలిగించేందుకు మాక్ డ్రిల్ నిర్వహించినట్టు జంగారెడ్డిగూడెం ఆర్డీఓ రమణ తెలియజేసారు. కార్యక్రమంలో వేలేరుపాడు తహసీల్దార్, రెవిన్యూ, రాష్ట్ర విపత్తు నివారణ సిబ్బంది, ప్రభుత్వులు పాల్గొన్నారు.

స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రజలు జీవించాలి : ఎమ్మెల్యే బడేటి

విశాలాంధ్ర ప్రతినిధి -ఏలూరు : స్వేచ్ఛాయుతమైన స్నేహపూర్వక వాతావరణంలో ప్రజలంతా సంతోషంగా జీవించాలన్నదే తన ఆకాంక్ష అని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి పేర్కొన్నారు. ఏలూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా శుక్రవారం పలువురు తమ సమస్యలను విన్నవించేందుకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. తనను కలిసేందుకు వచ్చిన వారి సమస్యలను క్షుణ్ణంగా తెలుసుకున్నారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ స్వేచ్ఛాయుత వాతావరణంతోనే అసలైన ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతోందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఏలూరు నియోజకవర్గంలో స్నేహపూర్వక వాతావరణం కల్పించేందుకు కృషిచేస్తున్నట్లు చెప్పారు. అలాగే ప్రజా సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా శ్రమిస్తూ రానున్న కాలంలో ప్రజా సమస్యలన్నింటిని పరిష్కరించేలా కృషి చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఏలూరు జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులైన న్యాయవాది ఏవి. నారాయణ మర్యాద పూర్వకంగా ఎమ్మెల్యే బడేటి చంటి, పార్టీ సీనియర్ నాయకులు చల్లా వెంకట సత్య వర ప్రసాదరావులను కలుసుకుని పుష్పగుచ్ఛాలు అందించి, కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం న్యాయవాది నారాయణను ఎమ్మెల్యే బడేటి చంటి ఘనంగా సన్మానిం చారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ మామిళ్ళపల్లి పార్థసారధి, నగర పార్టీ అధ్యక్షులు పెద్దిబోయిన శివప్రసాద్, టిడిపి నాయకులు చిరంజీవి, గూడవల్లి వాసు, నౌడూరి వాసు, త్రిపర్ణ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మూల్యాంకనం పగడ్బందీగా పూర్తి చేయాలి

విశాలాంధ్ర-వీరవాసరం: పదవ తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం పగడ్బందీగా పూర్తి చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. వీరవాసరం ఎం.ఆర్.కె జిల్లా పరిషత్ హైస్కూల్ లో గురువారం నుంచి ప్రారంభమైన పదవ తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం ప్రక్రియను కలెక్టర్ తోపాటు జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పదవ తరగతి జవాబు పత్రాలు మూల్యాంకనం పగడ్బందీగా పూర్తి చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు తెలిపారు. జిల్లా చుట్టుపక్కల జిల్లాల మినహా మిగతా జిల్లాల్లోని 9 సబ్జెక్టులకు సంబంధించి 1,69,341 జవాబు పత్రాలు చేసేందుకు మన జిల్లాకు వచ్చాయన్నారు. 102 మంది చీఫ్ ఎగ్జామినర్స్, 612 మంది సహాయ ఎగ్జామినర్స్, 204 మంది స్పెషల్ అసిస్టెంట్లు మొత్తం 918 మంది జిల్లా విద్యాశాఖ అధికారి ఇ. నారాయణ పర్యవేక్షణలో జవాబు పత్రాల మూల్యాంకనం పూర్తి చేసేందుకు నియమించడం జరిగిందన్నారు.

సీపీఐ బలోపేతానికి కృషి చేస్తా

సీపీఐ మండల కార్యదర్శి తొర్లపాటి బాబు

విశాలాంధ్ర-చింతలపూడి: సీపీఐని బలోపేతం చేయడానికి కృషి చేస్తానని నూతనంగా ఎన్నికైన సిపిఐ చింతలపూడి మండల కార్యదర్శి తొర్లపాటి బాబు తెలిపారు. స్థానిక సిపిఐ పట్టణ కార్యాలయంలో బాబు విలేకరులతో మాట్లాడుతూ సిపిఐ 13వ మహాసభలో పలుతీర్మా నాలను చేసినట్లు తెలిపారు. చింతలపూడి కేంద్రంగా బొగ్గు నిల్వలు వెలికితీసే పనులు చేపట్టాలని, దీనివలన చింతలపూడి ప్రాం తంలో నిరుద్యోగం తగ్గుతుందని అన్నారు. చింతలపూడి వంద పడకల ఆసుపత్రి నిర్మాణం వెంటనే పూర్తి చేయాలని, చింతలపూడి బస్ డిపో ఏర్పాటు చేయాలని తీర్మానించినట్లు తెలిపారు. చింతలపూడి నుండి ఏలూరు, సత్తుపల్లి, ద్వారకాతిరుమల వెళ్లే రోడ్లను నాలుగు లైన్ల రోడ్లుగా అభివృద్ధి చేయాలని, సాగునీటి చెరువులను సమగ్రంగా అభివృద్ధి చేయా లని తీర్మానించామన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకంలో భూమి కోల్పోయిన రైతులకు ఎకరాకు రూ.40 లక్షల నష్టపరి హారం ఇవ్వాలని, శివాపురం, కోటపాడు, గ్రామాల వద్ద తమ్మిలేరు మీద వంతెన నిర్మించాలని తీర్మానం చేశామన్నారు. ఈ సమావేశంలో సహాయ కార్యదర్శి దొంత కృష్ణ,మండల కమిటీ సభ్యులు కంచర్ల గురవయ్య,పి. సోమశేఖర్, ఎస్కె కాలేశా, ఎస్ కే జానీ, కౌన్సిల్ సభ్యులు టి.మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నూతన కార్యవర్గం

సీపీఐ మండల కార్యదర్శిగా తొర్లపాటి బాబు, సహాయ కార్యదర్శిగా దొంత కృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు సీపీఐ మండల నూతన కార్యదర్శి తొర్లపాటి బాబు తెలియజేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ చింతలపూడి మండల 13వ మహాసభలో కమిటీని ఎన్నుకున్నట్టు తెలిపారు, 17 మందితో నూతన కౌన్సిల్, 9 మందితో మండల కార్యవర్గం మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుందని తెలిపారు.

మండల కార్యదర్శిగా తొర్లపాటి బాబు, సహాయ కార్యదర్శిగా దొంతకృష్ణ, కమిటీ సభ్యు లుగా జంగా రామచంద్రా రెడ్డి, కంచర్ల గురవయ్య, పుల్లూరి సోమశేఖర్, గంధం అంజమ్మ, ఎస్ కే జానీ,ఎస్కే కాలేషా, కౌన్సిల్ సభ్యులుగా ముల్లగిరి అలె గ్జాండర్, ముల్లగిరి నాగేశ్వర రావు, ఎస్‌కే లాల్‌బి, ఇస్తరాకుల వెంకటేశ్వర రావు, ఎస్కే మస్తాన్, చేపల్లి శ్రీనివాసరావు, ముల్లంగి కిషోర్ రెడ్డి, తాడిగడప మాణి క్యాలరావు ఎన్నికయ్యారు. ఆహ్వానితులుగా బోడ వజ్రం, కొండా రామకృష్ణంరాజు బోయిన శ్రీనులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

చలివేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురం పట్టణ దేవతల కొలువైన శ్రీ సుబ్బాలమ్మ ఆలయ ప్రాంగణంలో శ్రీ రామానంద చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం అమలాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ పి వీరబాబు ప్రారంభించారు. ద్వారంపూడి బాలమురళి శ్రీనివాసరెడ్డి సమకూర్చిన కొబ్బరి బోండాలను బండాలను బాటసారులకు. భక్తులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ పెద్దిరెడ్డి సాయి పుల్లయ్య నాయుడు, యర్రం శెట్టి నారాయణ మూర్తి, తిక్కిరెడ్డి నేతాజీ, ముత్యాల గంగాధర్, నిమ్మకాయల నాని, మానే ప్రకాష్, బులియన్ అసోసియేషన్ సభ్యులు వ్యాపారస్తులు పాల్గొన్నారు.

30 లోపు పన్ను చెల్లిస్తే
5శాతం రిబేటు : కమిషనర్

విశాలాంధ్ర - కాకినాడ : పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి శుక్రవారం జారీ చేయబడిన ఉత్తర్వులు ప్రకారం 2025 - 2026 సంవత్సరమునకు సంబంధించినటువంటి ఆస్తి పన్నులను ఏప్రిల్ నెల 30లోపు ఒకేసారి చెల్లించే వారు, ఆస్తి పన్నుపై 5% శాతం రిబేట్ పొందవచ్చునన్నారు. ఈ నెల ఆఖరిలోపు చెల్లించే వారికి మాత్రమే ఈ రిబేటు అందనుంది. ప్రస్తుతము 2025 - 26 సంవత్సరమునకు గాను ERP అప్లికేషన్‌లో డిమాండ్ నోటీసులు జనరేట్ చేయు ప్రక్రియ జరుగుచున్నది. సదరు ప్రక్రియ పూర్తికాగానే, ఈనెల 7 నుండి ప్రజలు పన్ను చెల్లించి, 5% రిబేటు పొందవచ్చును. నగర ప్రజలు సదరు అవకాశాన్ని సద్వినియోగపరుచుకొని విధిగా పన్నులు చెల్లించి నగర అభివృద్ధికి తోడ్పడాలని కమిషనర్ కోరారు.

మజ్జిగ పంపిణీ

విశాలాంధ్ర -కొవ్వూరు : వేసవి ఎండలను పురస్కరించుకుని కొవ్వూరు ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ప్రజలకు మజ్జిగ పంపిణీ చేసారు. ప్రెస్ క్లబ్ కార్యదర్శి తోట అవినాష్ దంపతుల వివాహ దినోత్సవం సందర్భంగా అవినాష్ వితరణతో మజ్జిగ పంపిణీ చేసారు. చలివేంద్రాన్ని కొవ్వూరు మున్సిపల్ కమిషనర్ టి. నాగేంద్ర కుమార్ ప్రారంభించి మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తి తీర్చే కార్యక్రమాలు చేపట్టిన ప్రెస్ క్లబ్ సభ్యులను అభినందిస్తున్నా అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు మరింత మంది చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నల్లా నాయుడుబాబు, ఎస్ వివి.సత్యప్రసాద్, పుప్పాల సురేష్, సభ్యులు గరగ ప్రసాద్, రవికుమార్, శర్మ, దేవదాన్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కార్పొరేషన్ ముఖాముఖీలు

విశాలాంధ్ర - చాగల్లు: కార్పొరేషన్ సబ్సిడీ రుణాలతో యువతకి ఉపాధి కల్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని మండల అభివృద్ధి అధికారి శ్రీదేవి అన్నారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలం మొత్తం మీద సుమారు 1000 దరఖాస్తులు రావడం జరిగిందని అందులో 810 మంది హాజర య్యారని, స్థానిక మండల బ్యాంక్ మేనేజర్స్ తో, ఎంతో పారదర్శకంగా ముఖాముఖీలు నిర్వహించామని తెలిపారు. సిబ్బంది, ఎంపీపీ వీరస్వామి పాల్గొన్నారు.

జీవో 15 రద్దు చేయాలని ధర్నా

విశాలాంధ్ర -రాజమహేంద్రవరం : 60 సంవత్సరాలు నిండిన ఆప్కాస్ మున్సిపల్ అవుట్ సోర్సింగ్ కార్మికులను విధులలోకి రావద్దని తీసుకొచ్చిన జీవో నెంబర్ 15 రద్దు చేయాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధం ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నా అనంతరం డిప్యూటీ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు తాటిపాక మధు మాట్లాడుతూ గత 50 సంవత్సరాలుగా మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు ఎవరైనా మృతిచెందినా, రిటైరైనా వారి కుటుంబీకులకే ఉద్యోగాలు సాంప్రదాయ పద్ధతిలో ఇచ్చేవారని నేడు కూటమి ప్రభుత్వం దీనిపై క్లారిటీ ఇవ్వడం లేదని ఆయన విమర్శించారు. రాజమండ్రి మున్సిపాలిటీలో 20 మంది కార్మికుల పైగా రేపటి నుంచి వీధిలోకి రావద్దని అకస్మాత్తుగా చెప్పడం దారుణమన్నారు. ఏసీల్లో కూర్చునే వారికి 62 సంవత్సరాలు పెంచి రోడ్డుమీద కష్టపడి నానా చాకిరి చేస్తూ బతుకు ఈడుస్తున్న మున్సిపల్ అవుట్ సోర్సింగ్ కార్మికులను మాత్రం 60 సంవత్సరాలకే

కుదించడం అన్యాయమన్నారు. మున్సిపల్ కార్మికులకు 62 సంవత్సరాలు సర్వీస్ పెంచే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికలలో హామీలు ఇచ్చిన విధంగా మున్సిపల్ కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికులను వెంటనే రెగ్యులర్ చేయాలని, వారి జీవితాల్లో వెలుగు నింపాలని మధు డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులకు గ్రాట్యుటీ ఇవ్వాలని. ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సంగిశెట్టి రమణ, ప్రధాన కార్యదర్శి అల్లం వెంకటేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.దుర్గమ్మ, ఉపాధ్యక్షులు బంగారు గిరి, అల్లం బాలు, గూడుపు వెంకటగిరి, బాబు, పోలమ్మ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

విశాలాంధ్ర - అనపర్తి : బిక్కవోలు మండలంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. శుక్రవారం బిక్కవోలులో రూ.38.85 లక్షలతో నిర్మించే 4 సీసీ రోడ్లకు, ఊలపల్లిలో రూ. 30 లక్షలతో నిర్మించే మూడు సిసి రోడ్లకు, ఆర్ఎస్ పేటలో రూ. ఐదు లక్షలతో నిర్మించే సీసీ రోడ్డుకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఊలపల్లిలో కాకర రామన్న చౌదరి సౌజన్యంతో రూ.7 లక్షల వ్యయంతో నిర్మించిన బస్టాండ్ ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం నూతనంగా నిర్మించిన శ్రీ అభయ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం పురస్కరించుకుని ఎమ్మెల్యే నల్లమిల్లి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తేతలి సుమ, ఎన్డీఏ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతి : రఘురామ

విశాలాంధ్ర కొవ్వూరు : రాష్ట్రంలో ఇప్పుడిప్పుడే పారిశ్రామిక ప్రగతి మొదలవుతుందని, రాష్ట్రంలో పరిశ్రమలు రావాలి, తద్వారా ఆదాయం పెరగాలి, పెరిగిన ఆదాయాన్ని ఖర్చు పెట్టాలని రాష్ట్ర శాసనసభ ఉప సభాపతి రఘురామ కృష్ణంరాజు అన్నారు. కొవ్వూరులోని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పరిమి రాధాకృష్ణ గృహానికి శుక్రవారం భోజనానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో కొద్దిసేపు మాట్లాడుతూ పరిశ్రమలు రాత్రికి రాత్రే రావని, వైజాగ్ లో చాలా ఫ్యాక్టరీలు ఏర్పాటులో ఉన్నాయని, అత్యంత వేగంగా నిర్మాణాలు జరిగినా రెండున్నరేళ్ల పడుతుందని, ఉన్న పరిశ్రమలను కాపాడుకుంటూ, కొత్త పరిశ్రమలను స్థాపించి ఆదాయ వనరులు పెంచుకోవాలన్నారు. విలేకర్లు అడిగిన కొన్ని ప్రశ్నలకు బదులిస్తూనే నేను ప్రభుత్వం, మంత్రివర్గంలో లేను, మంత్రిని అడగాల్సిన ప్రశ్నలు నన్నడిగితే ఎలా అంటూ ఎదురు ప్రశ్నించారు. రాష్ట్రంలో ఊహించనిదానికన్నా చాలా ఎక్కువగా ఆర్థిక మాన్యం ఉందని, అయినప్పటికీ ఒక్కొకటి చేసుకుంటూ ముందుకు వెళతామని ముఖ్యమంత్రి చంద్రబాబు సభలో చెప్పారని, అదే నేను చెబుతున్నా అన్నారు. ఇప్పటికే సంపద సృష్టిలో

ముఖ్యమంత్రి నిమగ్నమై ఉన్నారని అన్నారు. 10 నెలల్లోనే అన్ని హామీలు అమలు సాధ్యం కాదని, విమర్శించడం చాలా సులువు, కెమెరా ముందు చెప్పారుగా అంటే అడగడంలో తప్పులేదని, అందులో సాధ్యాసాధ్యాలను రాజకీయ నాయకులకన్నా ప్రజలే ఎక్కువగా గుర్తించాల్సిన అవసరం ఉందని అన్నారు. అమరావతి ద్వారా 60 వేల కోట్ల నిర్మాణాలు జరుగుతాయని, 18 శాతం జీఎస్టీ, అందులో సగభాగం రాష్ట్రానికి ఆదాయం వస్తుందని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే లు కేఎస్ జవహర్, జనసేన కొవ్వూరు నియోజక వర్గ కన్వీనర్ టీవీ రామారావు, బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చ ఉపాధ్యక్షురాలు నర్సిపల్లి హారిక, టిడిపి నాయకులు సూరపని చిన్ని, సూర్యదేవర రంజిత్, వేగి చిన్నా, జనసేన నాయకులు మారిశెట్టి వేంకటేశ్వర రావు, సుంకర సత్తిబాబు, బీజేపీ నాయకులు కె. జగన్, ఎపిఆర్ చౌదరి, దేగల సునీత తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ

విశాలాంధ్ర - కొవ్వూరు : ఉద్యోగములో ఉత్తమ నైపుణ్య తను కనబరిచిన ఉద్యోగులను సత్కరించడం జరిగిందని కొవ్వూరు డిపో మేనేజర్ వైవివిఎన్ కుమార్ అన్నారు గురువారం కొవ్వూరు డిపో మేనేజర్ కార్యాలయం నందు ఆదర్శ ఉద్యోగుల అభినందన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ డ్రైవర్ కండక్టర్ ఉద్యోగంలో మెరుగైన నైపుణ్యతను కనపరిచిన వారిని సత్కరించడం జరిగిందని తెలిపారు డ్రైవర్ పైడి రావు 1340 లీటర్ల ఆయిల్ ను ఆదా చేసినందుకు ఉత్తమ డ్రైవర్ గా ప్రథమ స్థానంలో నిలిచారని జి ఎస్ రావు ఉత్తమ డ్రైవర్గా ద్వితీయ స్థానంలో నిలిచారని తెలిపారు కండక్టర్ విభాగంలో ఎం విజయ 42.78 పాయింట్లు నువ్వు సాధించి ఉత్తమ కండక్టర్గా ప్రథమ స్థానంలో నిలిచారని ఎండి రఫీ ఉల్లా 42.38 సాధించి డిపో ఉత్తమ కండక్టర్గా ద్వితీయ స్థానంలో నిలిచారని తెలిపారు వీరికి ప్రశంస పత్రం, నగదు బహుమతులతో సత్కరించడం జరిగిందని డిపో మేనేజర్ తెలిపారు

అభివృద్ధి పనులు ప్రారంభం

విశాలాంధ్ర - పిఠాపురం : పవన్ కళ్యాణ్ చొరవతో చేపట్టిన అభివృద్ధి పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. పిఠాపురం నియోజకవర్గ పర్యటనలో భాగంగా శాసన మండలి సభ్యుడు కొణిదల నాగబాబు పూర్తయిన పనులను ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తున్నారు. అందులో భాగంగా రూ.28.5 లక్షల సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన గొల్లప్రోలు మండల నూతన తహసీల్దార్ కార్యాలయాన్ని శాసన మండలిలో ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్‌తో కలసి ప్రారంభించారు. అనంతరం గొల్లప్రోలు హెడ్ వాటర్ వర్క్స్‌లో రూ.65.24 లక్షలతో మంచినీటి సరఫరా కేంద్రంలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. పంప్ హౌస్‌లో మోటార్ల పని తీరుని పరిశీలించారు. అనంతరం గొల్లప్రోలు పట్టణంలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటిన్‌ని ప్రారంభించారు. క్యాంటిన్‌లో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజనాన్ని వడ్డించారు. నాగబాబుతో పాటు ఏపీ టిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయ కుమార్, కాకినాడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు), కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, జనసేన పార్టీ పిఠాపురం నియోజకవర్గం సమన్వయకర్త మర్రెడ్డి శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

కళలకు... కళాకారులకు పూర్వ వైభవం

విశాలాంధ్ర-రాజమహేంద్రవరం : రాష్ట్రంలో సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంలో కళలకు, కళాకారులకు పూర్వ వైభవం వస్తుందని శాసన సభ డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణంరాజు, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. స్థానిక సెంట్రల్ జైలు ప్రధాన రహదారి మార్గంలో ఏర్పాటు చేసిన అమరావతి చిత్రకళా ప్రదర్శనను అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి వారు ప్రారంభించారు. ముఖ్య అతిథి రఘురామ కృష్ణంరాజు మాట్లాడుతూ కళలకు పుట్టినిల్లు అయిన రాజమహేంద్రవరంలో ఈ ప్రదర్శన నిర్వహించనున్నట్లు మంత్రి దుర్గేశ్ ప్రతిపాదించడం, ఏపీ స్టేట్ క్రియేటివిటీ అండ్ కల్చర్ కమిషన్ చైర్ పర్సన్ తేజస్వి పొడపాటి స్ఫూర్తివంతమైన విధానంలో ఏర్పాట్లు చేయడం అభినందనీయమని అన్నారు. ఈ ప్రదర్శనను వీక్షించడంతో పాటు కళలను, కళాకారులను ప్రోత్సహిస్తూ ఆ చిత్రాలను కొనుగోలు చేయాలని కోరారు. మంత్రి దుర్గేశ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కళలను ప్రోత్సహిస్తూ, కళాకారులకు పూర్వ వైభవం తీసుకురావడంపై చిత్తశుద్ధి కలిగి ఉందని అన్నారు. కళాకారుల ప్రతిభను గుర్తించాలని, వారు గీసిన

చిత్రాలను కొనుగోలు చేసి కళాకారులకు చేయూతనివ్వాలని కోరారు. రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ పర్యాటక అభివృద్ధికి అవసరమైన సూచనలు, సలహాలు ఇవ్వడాన్ని అభినందించారు. తేజస్వి పొడపాటి మాట్లాడుతూ కూచిపూడి నృత్యం, కర్ణాటక సంగీతం అంటే గుర్తుకు వచ్చేలా కళలకు కాణాచిగా ఆంధ్ర ప్రదేశ్‌ను తీర్చిదిద్దేలా అడుగులు వేస్తున్నామన్నారు. శాసన సభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్, బత్తుల బలరామ కృష్ణ మాట్లాడుతూ రాజమండ్రి నగరంలో ఇటువంటి కార్యక్రమాన్ని చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చిత్రాన్ని రూ.1,01,116 కు కొనుగోలు చేశారు. రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి, జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్, సాంస్కృతిక శాఖ సంచాలకులు డి.మల్లికార్జునరావు, అధికారులు, కళాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

7న 'జాబ్ మేళా'

విశాలాంధ్ర – కాకినాడ : 'వికాస' కార్యాలయంలో ఏప్రిల్ 7న సోమవారం 'జాబ్ మేళా' నిర్వహిస్తున్నారు. ఈ జాబ్ మేళాలో రాయల్ ఇన్సురన్స్ బ్రోకింగ్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ లో ఫైనాన్సియల్ అసోసియేట్, క్లైంట్ కేర్ అసోసియేట్ & మార్కెటింగ్ అసోసియేట్, ఎస్ఎస్ టాక్స్ కన్సల్టెన్సీ ప్రైవేటు లిమిటెడ్‌లో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, సిఆర్ఎమ్, డేటా అనలిస్ట్ అండ్ ఆఫీస్ బాయ్, మళ్లీ షీల్డ్ లోబిజినెస్ డెవలప్ మెంట్ మేనేజర్, స్మైక్వాడ్ ఎలక్ట్రానిక్స్ కంపెనీలో టెక్నీషియన్, ఐటిసి లిమిటెడ్, ఫుడ్స్ డివిజన్‌లో ఆపరేటర్, ఇండో ఎంఐఎం, హోండాయ్ గ్లోవిస్ అండ్ హోండాయ్ మోబిస్ కంపెనీల్లో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. పై ఉద్యోగాలకు ఎస్ఎస్‌సి, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ, బి టెక్ & ఎంబిఏ మార్కెటింగ్ ఉత్తీర్ణులైన 35సంలోపు అభ్యర్థులు అర్హులు. నెలకు రూ.10,000 నుండి రూ.20,000 వరకు జీతం ఇన్సెంటివ్స్, భోజనం, వసతి అండ్ రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుంది. ఆసక్తి గల అభ్యర్థులందరూ ఏప్రిల్ 7న సోమవారం 'వికాస కార్యాలయం, కలెక్టరేట్, కాకినాడ ' వద్ద ఉదయం 9.00గం.లకు సర్టిఫికెట్స్ జెరాక్స్‌లతో హాజరుకావలెను. మరిన్ని వివరాలకు 77993763333, www.vikasajobs.com సంప్రదించవలెను.

కార్పొరేషన్ రుణాలకు 195 మంది హాజరు

విశాలాంధ్ర – ఆత్రేయపురం : మండల కేంద్రంలోని ఆత్రేయపురం మండల ప్రజా పరిషత్ ర్యాలయము నందు శుక్రవారం ఉదయం గం.10.00ల నుండి సాయంత్రం గం.5.00ల వరకు కాపు, బిసి మరియు ఇడబ్ల్యుఎస్ కార్పొరేషన్ ఋణాలకు సంబంధించి వివిధ గ్రామాలలో దరఖాస్తుదారులను ఎంపిడిఓ బికెఎస్ఎస్ వెంకట రామన్, మరియు బ్యాంకు మేనేజర్లు ఇంటర్వ్యూలు నిర్వహించారు. అందు దరఖాస్తు చేసుకొనిన 285 మంది దరఖాస్తుదారులకు 195 మంది హాజరైనారని ఎంపిడిఓ బికెఎస్ఎస్ వెంకట రామన్ తెలిపారు. ఈ కార్యక్రమములో మండల పరిషత్ పరిపాలనాధికారి వి రామ స్వరూప్, మండల పరిషత్ సిబ్బంది, మరియు వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా భీమశంకరరావు

విశాలాంధ్ర – ఆలమూరు : ఆలమూరు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక శుక్రవారం ఏకగ్రీవంగా జరిగింది. నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా ఆలమూరుకు చెందిన కాండ్రేగుల భీమశంకరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా ఎం కృపావరం, కార్యదర్శిగా జి రాజశేఖర్, ఉప కార్యదర్శిగా డి మహాలక్ష్మి, కోశాధికారిగా ఏ గోవిందరాజులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రధాన ఎన్నికల అధికారిగా వ్యవహరించిన ప్రముఖ న్యాయవాది అంగర బిందు మాధవరావు ప్రకటించారు. నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా ఎన్నికైన భీమశంకర్ రావుతో పాటు కార్యవర్గంలో ఎన్నికైన వారిని పలువురు న్యాయవాదులు, అధికారులు, నాయకులు అభినందించారు.

కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

విశాలాంధ్ర – రాజోలు : రాజోలు మండలంలో వివిధ కార్పొరేషన్ రుణాల మంజూరు, లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమం రాజోలు మండల పరిషత్ కార్యాలయంలో గరు, శుక్రవారం నిర్వహించారు. మండలానికి కేటాయించబడ్డ 64 యూనిట్లకు 1,209 మంది దరఖాస్తులు చేసుకున్నారు. 884 మంది ఇంటర్వ్యూలకు హాజరు అయ్యారని ఎంపీడీవో రాంబాబు తెలిపారు. రాజోలు, తాటిపాక, పొన్నమండ, కడలి బ్యాంకులకు చెందిన మేనేజర్, ఫీల్డ్ ఆఫీసర్లు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఏవో మామిడి శెట్టి వీర వెంకట సత్యనారాయణ, ఈవోపీఆర్డి రెహమాన్, కడలి సెక్రటరీ ఎస్ సత్యప్రసాద్,

సీసీ రోడ్లు, డ్రైనేజీలు ప్రారంభం

విశాలాంధ్ర – గండేపల్లి : గండేపల్లి మండలం మురారి గ్రామంలో కూటమి ప్రభుత్వ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న పల్లె పండుగ కార్యక్రమాన్ని పండగ వాతావరణంలో మురారి గ్రామ ఉప సర్పంచ్ జాస్తి వసంత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జగ్గంపేట శాసనసభ్యులు, టిటిడి బోర్డు మెంబర్ జ్యోతుల నెహ్రూ ముఖ్య అతిథిగా హాజరై 1కోటి యాభై లక్షల రూపాయలతో నిర్మించిన సిమెంట్ రోడ్డు సిసి డ్రైన్లు, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ప్రారంభించారు. ముందుగా ఎన్టీఆర్, కందుల కొండయ్య దొర విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం తమ స్కూల్‌కి రోడ్డు వేయించినందుకు ఎమ్మెల్యే నెహ్రూకు స్కూల్ విద్యార్థిని విద్యార్థులు థాంక్యూ ఎమ్మెల్యే సార్ అనే పే కార్డులతో ఘన స్వాగతం పలికి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ప్రభుత్వ అధికారులందరినీ ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన పది నెలల కాలంలోనే రూ.25 కోట్ల రూపాయలతో నియోజకవర్గంలో మొదటి విడతగా మిగిలి ఉన్న సిమెంట్ రోడ్లు వేయడం జరిగిందని అదేవిధంగా నియోజకవర్గంలోని బీటీ రోడ్లు కూడా నిర్మాణం జరుగుతున్నాయని రెండో సంవత్సరంలో సిమెంట్ డ్రైన్లు నిర్మించడానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. అనంతరం గండేపల్లిలో రూ.30 లక్షలతో సిసి రోడ్డు, మల్లేపల్లిలో రూ.40 లక్షలతో సిసి రోడ్డు, సుబ్బయ్య పేటలో రూ.10 లక్షలతో సిసి రోడ్లు శుక్రవారం పల్లె పండుగ కార్యక్రమంలో పాల్గొని పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పోతుల మోహనరావు, కుంచే రాజా, కందుల చిట్టిబాబు, అడబాల భాస్కరరావు, జాస్తి వసంత్, సుంకవిల్లిరాజు, బొల్లం రెడ్డి రామకృష్ణ, సుంకవిల్లి రమేష్, కురుకూరి చౌదరి, శీలామంతుల వీరబాబు, అడబాల ఆంజనేయులు, బలిరెడ్డి గంగరాజు, తెలగ రెడ్డి భద్రరావు, తదితరులు పాల్గొన్నారు

ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డులో బబ్లూకు స్థానం

విశాలాంధ్ర – రాజానగరం : చిత్రలేఖనం పై తనకున్న మక్కువతో ఇప్పటికే అనేక అవార్డులు,పలువురు మన్ననలు ప్రశంసలు ఆ యువకుడి సొంతం.తాజాగా ఆ యువకుడు పడ్డ కష్టానికి ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం దక్కించుకున్నాడు. దీంతో గల్లీ నుంచి ఢిల్లీ వరకు దివాన్ చెరువు గ్రామ ఖ్యాతిని నలుదిశలు అందరికీ తెలిసేలా చేశాడు. వివరాల్లోకి వెళ్తే తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం దివాన్ చెరువు గ్రామంలో సుమారు 27 ఏళ్లుగా ఉంటున్న దాంగి బబ్లూ అలియాస్ పానీపూరి బబ్లూ ఓ పక్క చదువుతూ మరో పక్క168 గంటలు కష్టపడి బియ్యపు గింజలతో వేసిన తిరుపతి వెంకటేశ్వరస్వామి చిత్రం ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డుల్లో 2025కి గాను స్థానం దక్కించుకుంది.ఈ సందర్భంగా బబ్లూ శుక్రవారం విశాలాంధ్రతో చరవాణితో మాట్లాడుతూ మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని మాళ్వా ప్రాంతంలోని నీమచ్ పట్టణానికి చెందిన తమ కుటుంబం సుమారు 27 ఏళ్లుగా దివాన్ చెరువు గ్రామంలో నివాసం ఉంటున్నామని చెప్పారు. తమ తండ్రి స్థానికంగా పానీపూరి చిరు వ్యాపారం చేస్తూ తమ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నన్నారు. తాను ప్రస్తుతం ఢిల్లీలోని ఢిల్లీ కళాభూమి ఆర్ట్స్ కళాశాల నందు అంటారా క్రాఫ్ట్ అనే చిత్ర కళారంగానికి సంబంధించిన కోర్సు చదువుతున్నట్లు చెప్పారు. ఈ నెల15న ఢిల్లీ నగరంలో అవార్డు లు ప్రధానోత్సవం జరుగుతుందన్నారు.

అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి

విశాలాంధ్ర – అనపర్తి : వైయస్సార్సీపి అరాచకాలు, అకృత్యాలకు పాల్పడితే కూటమి ప్రభుత్వం అభివృద్ధి కోసం పాటుపడుతుందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం బిక్కవోలు మండలం రంగాపురం లో రూ.21 లక్షల వ్యయంతో నిర్మించే రెండు సిసి రోడ్లకు ఎమ్మెల్యే నల్లమిల్లి శంకుస్థాపన చేశారు.అనంతరం పంచాయతీ కార్యాలయం, గ్రామంలో రూ.3 లక్షల 20 వేలతో ఏర్పాటుచేసిన 21 సీసీ కెమెరాలను ఎమ్మెల్యే నల్లమిల్లి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే ఎంపీపీ ఎంపికపై అనేక ఆరోపణలు చేశారని, అపరిమిత అధికారం అనుభవించిన మీ మాజీ ఎంపీపీ అధ్యక్ష పదవికి, మళ్ళీ ఇప్పుడు ఎంపిటిసికి ఎందుకు రాజీనామా చేసినట్టని ప్రశ్నించారు. అదే విధంగా ఇల్లపల్లి– రంగాపురం మధ్య ఉన్న గేటు స్థానంలో ఫ్లై ఓవర్ నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వ సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే నల్లమిల్లి తెలిపారు. ఒక గ్రామానికి అని కాకుండా నియోజకవర్గంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందని, నియోజ కవర్గ సర్వతోముఖాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తేతలి సుమ, ఎమ్ ఎస్ ఆర్ కె రాజు, పలువురు ప్రజా ప్రతినిధులు, ఎన్డీఏ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య మహాసభ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

విశాలాంధ్ర – పిఠాపురం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ నూతన కాకినాడ జిల్లా ఆవిర్భావం, ప్రమాణ స్వీకార కార్యక్రమం కాకినాడ వెంకీ రెసిడెన్సీలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని శ్రీరామ సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని నూతన జిల్లా కార్యవర్గం సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షులుగా పులవర్తి కుమార్, పిఠాపురం ఉపాధ్యక్ష అడ్మినిస్ట్రేటివ్‌గా వెలగా వెంకట నగేష్ బాధ్యతలు స్వీకరించారు. కార్యదర్శిగా యక్కల ప్రసాదు, కోశాధికారిగా గ్రంధి దిలీప్ తదితర నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. వారిలో జోన్ ఛైర్మన్గా ఇమ్మిడిశెట్టి నాగేంద్ర కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బోడ సతీష్, అడిషనల్ కోశాధికారిగా కే తాతాజీ, జోన్ కన్వీనర్‌గా కుసుమంచి సురేష్, ఒలంట్రీ కమిటీ వైస్ చైర్మన్ కొత్త దేవ జగన్మోహన్రావు, వాణిజ్య విభాగం సెక్రటరీగా చెక్క శోభనాద్రి రావు, యువజన సంఘం వైస్ చైర్మన్‌గా రేపాక రమేష్, సోషల్ మీడియా కన్వీనర్‌గా దంగేటి సాయి, పబ్లిక్ రిలేషన్స్ ప్రతినిధిగా పైడా వివి రమణ (రాజా), వాలంటరీ కమిటీ వైస్ చైర్మన్‌గా కంచర్ల నగేష్ గుప్తా, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్గా కడంచర్ల శంకర్, పిఠాపురం నాయకులచే ముఖ్యమైన పదవుల్లో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా పిఠాపురం మండల ఆర్యవైశ్య సంఘ నాయకులు యావన్మంది హర్షం వ్యక్తం చేశారు.

భూ సారానికి ప్రకృతి వ్యవసాయ కిట్స్

విశాలాంధ్ర – రౌతులపూడి : రౌతులపూడి మండలం గిడజాం గ్రామంలో మహిళా సంఘాలు APCNF సిబ్బంది, రౌతులపూడి మండలంలో ప్రకృతి వ్యవసాయదారుల కోసం ప్రీ మాన్సూన్ డ్రై షోయింగ్ కోసం PMDS కిట్స్ తయారీ చేపించడం జరిగింది. ఈ కార్యక్రమములో మాస్టర్ ట్రైనర్ వరలక్ష్మి మాట్లాడుతూ రైతులు వర్షాలు పడే సమయానికి ముందుగా భూమి సారవంతంగా తయారవడవకోసం 32 రకాల విత్తనాలను ముందుగా పొలములో వేసుకోవాలని తద్వారా భూమిలో సారవంతమైన పోషకాలు ఏర్పడి పంటలో అధిక దిగుబడి వస్తుందని ఆమె అన్నారు. ప్రతీ రైతు ఎకరానికి పది నుంచి పన్నెండు కేజీలు విత్తనాలును వేసుకోవాలని ఆమె తెలిపారు. ఈ విత్తనాలు గ్రామంలో ఐసీఆర్పిలు వద్ద అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు. కిట్స్ రైతులు తొలకరి వానల కంటే ముందుగా ఈ యొక్క విత్తనాలను పొలంలో జల్లుకొని 45 రోజుల తర్వాత పశుగ్రాసంగా ఉపయోగించుకొని వేర్లను కలయదున్నటం ద్వారా భూమి సారవంతం అవ్వి ప్రధాన పంటలో పెట్టుబడి తగ్గించు కొరకు ఈపీ ఎండిఎస్ ఉపయోగపడు తుందన్నారు. ఈ కార్యక్రమములో సన్యాసిరావు, గొర్లి వీరలక్ష్మీ కలగ పద్మ, పులుగు అరుణ, L2, మణికంఠ L3లు. బాస్కర్ బాబు, నాగాసత్యవతి, గిడజాం గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

కాంప్లెక్స్ షాపులు వేలం

విశాలాంధ్ర–దేవరపల్లి: దేవరపల్లి మండలం ఎర్నగూడెం పంచాయతీలో మూడు కాంప్లెక్సల పరిధిలో 30 షాపులకు శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో వేలం నిర్వహించారు. ఈ వేలంలో 90 మంది పాల్గొని రూ.9 లక్షలు డిపాజిట్ చేశారు. ఒక్కొక్క షాపుకి 30 నెలలు పరిమితి విధిస్తూ వేలం ప్రారంభించారు. అంబేద్కర్ కాంప్లెక్స్ వైయస్సార్ కాంప్లెక్స్ నూతనంగా నిర్మించిన కాంప్లెక్స్ తో పాటు మొత్తం 30 షాపులకు వేలం నిర్వహించారు. ఈ వేళలో నెలకు రూ.1,55 700 రూపాయలు ఆదాయం లభించిందని గ్రామ కార్యదర్శి ఏ అమ్మి రాజు తెలిపారు. ఈ వేలంలో వైయస్సార్ కాంప్లెక్స్‌లో గల ఒకటో నెంబర్ షాపుకు అత్యధికంగా నెలకు రూ.25 వేల ఒక 100 రూపాయలకు తాడి కనకదుర్గ పాడుకొన్నారు. ఈ వేలం ప్రక్రియలో సర్పంచ్ బొంత భరత్ బాబు ఏఎంసీ మాజీ చైర్మన్ నరహరిశెట్టి, రాజేంద్ర బాబు, స్థానిక నాయకులు గద్దె శ్రీనివాస్, బొల్లిన విజయభాస్కర్, మండ సుబ్బారావు, పంచాయతీ అధికారులు రవికుమార్, నారాయణ, రాజేష్, గణేష్, సీతారామరాజు, స్థానిక ప్రముఖులు పాటదారులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి రుణాలకు ఇంటర్వ్యూలు

విశాలాంధ్ర – ఆలమూరు : మండల కేంద్రమైన ఆలమూరులో స్వయం ఉపాధి పథకానికి ఎంపిక చేసే అభ్యర్థులకు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఏ రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్వ్యూలు శుక్రవారంతో ముగిశాయి. మండలంలో మొత్తం 378 మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారని వీరిలో 288 మంది హాజరయ్యారన్నారు. మొత్తం రెండు రోజులు పాటు నిర్వహించిన ఇంటర్వ్యూలలో 584 మంది మాత్రమే హాజరయ్యారన్నారు. మండల పరిషత్ ఏవో మెహర్ ప్రకాష్, బ్యాంక్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర కాంగ్రెస్ కిసాన్ సెల్ చైర్మన్‌గా కామన

విశాలాంధ్ర - అమలాపురం : ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ కిసాన్ సెల్ చైర్మన్‌గా కామన ప్రభాకరరావు శుక్రవారం రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఆంధ్ర రత్న భవన్ విజయవాడలో ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల చేతుల మీదుగా బాధ్యతలు స్వీకరించారు. వైఎస్ షర్మిల మాట్లాడుతూ కిసాన్ సెల్ ద్వారా రాష్ట్రంలో ప్రతి జిల్లాలో పర్యటించి రైతు సమస్యలపై అవగాహన పెంచుకొని, రైతులకు అండగా నిలచి రైతు సంఘాలను కలుపుకొని, రైతుల పక్షాన్న ప్రభుత్వంపై పోరాటం చేయాలని తెలిపారు. కామన ప్రభాకరరావు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ చైర్మన్ భాధ్యతలు అప్పగించిన ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే కాంగ్రెస్ పార్టీ నేతలు సోనియాగాంధీ రాహుల్ గాంధీ, అఖిల భారత కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ చైర్మన్ సుఖపాల్ సింగ్ కైరా తదితరులు కృతజ్ఞతలు తెలియజేసినారు.పార్టీ నాయకులు రాజానాల రామమోహనరావు, నరహరిశెట్టి నరసింహారావు, వడ్డి నాగేశ్వర రావు, మీసాల బాబీ, గేదెల శ్రీనివాస్, పీ సత్యనారాయణ, కె వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు తక్షణమే మంజూరు చేయాలి

విశాలాంధ్ర - రాజానగరం : పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయడంతో పాటు నిర్మాణం కోసం 5 లక్షల ఆర్థిక సాయాన్ని తక్షణమే అందించాలనీ అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జన్నుపల్లి సత్తిబాబు,పి.వెంకట నాయుడు అన్నారు. ఎన్నికల ముందు ఎన్డీఏ కూటమి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ అఖిలభారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రమైన రాజానగరం లో శు క్రవారం ధర్నా చేపట్టారు.దీనిలో భాగంగా స్థానిక శ్రీ కాండ్రేగుల జోగి జగన్నాథం బహదూర్ పంతులు వారి అన్నదాన సత్రం నుండి బస్టాండ్ మీదుగా ర్యాలీ చేపట్టారు.హామీలు అమలు చేయాలని పెద్ద ఎత్తున ఆందోళన నినాదాలు చేశారు. తహశీల్దార్ జి.అనంత లక్ష్మి సత్యవతి దేవి కి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఇక్కడి విలేకర్లతో వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నిటిని వెంటనే అమలు చేయాలని, గ్రామాల్లో 3 సెంట్లు, పట్నాలో 2 సెట్లు, ఇళ్ల స్థలాలు పేదవాడి ఇల్లు నిర్మాణానికి 5 లక్షల ఆర్థిక సాయం చేయాలన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ఉపా ధ్యక్షులు కోనాల లాజర్, రాజ్యాంగ పరిరక్షణ సమితి జిల్లా కన్వీనర్ మేక లక్ష్మీ రావు,అఖిల భారత రైతు కూలీ సంఘం డివిజన్ నాయకులు మరకుర్తి వీరలక్ష్మి, బొలిశెట్టి సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు రద్దు చేయాలి : ముస్లిం ఐక్య వేదిక

విశాలాంధ్ర - నిడదవోలు : కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ముస్లిం వక్ఫ్ బోర్డులోని వివిధ అంశాలను సవరిస్తూ తీసుకు వచ్చిన ఉమీద్ యాక్ట్‌ను రద్దు చేయాలని ముస్లిం ఐక్య వేదిక ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రెసిడెంట్ జమ్ యియ్యత్ అహ్లెహదీస్, ముస్లిం ఐక్య వేదిక కన్వీనర్ ముహమ్మద్ నౌషాద్ ఆధ్వర్యంలో స్థానిక షాదిఖానాలో ముతవల్లిలు, ప్రజా ప్రతినిధులు, ముస్లిం పెద్దలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న పలువురు మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు సవరణ బిల్లులోని అంశాలు ముస్లిం మైనారిటీలకు రాజ్యాంగం కల్పించిన వివిధ రాయితీలు, ప్రత్యేక హక్కులను హరించే విధంగా ఉన్నాయన్నారు. వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును సమావేశం ముక్తకంఠంతో తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లుగా ప్రకటించారు. శుక్రవారం మజీదులలో ప్రత్యేక ప్రార్థనల అనంతరం అన్ని మస్జిద్ ల వారి ముతవలిల ఆధ్వర్యంలో గణపతి సెంటర్లోని ఐ లవ్ నిడదవోలు వద్ద మానవహారం నిర్వహించి ప్రదర్శన గా యం.ఆర్.ఓ కార్యాలయం కు

చేరుకుని ధర్నా నిర్వహించి డిప్యూటీ తహసిల్దార్ కు వినతిపత్రం అందజేశారు. ముందుగా మానవహారాన్ని ఉద్దేశించి ముస్లిం ఐక్య వేదిక నాయకులు వజీరుద్దీన్ , షరీఫ్,సి.పి.ఐ.యం.యల్ నాయకులు ఈమని గ్రీష్మ కుమార్ లు మాట్లాడారు. కార్యక్రమంలో ముస్లిం ఐక్య వేదిక నాయకులు జామియా మస్జిద్ ముతవలి అబ్దుల్ అజీజ్ భాషా, మర్కజ్ మజీద్ వైస్ ముతవలి అబ్దుల్ రవుఫ్ షహీన్, ఖురేషీ మస్జిద్ ముతవలి ఫహీం, బస్టాండ్ మస్జిద్ ఇమామ్ ముర్తజా, ఎన్టీఆర్ కాలనీ ఆయిషా మస్జిద్ ముతవలి జిలానీ, వై.యస్సార్ కాలనీ మస్జిద్ ముతవలి ముజహర్, జిల్లా జమాత్ అధ్యక్షులు మహమ్మద్ నౌషాద్, బాబు తదితరులు ఈ ర్యాలీకి నాయకత్వం వహించారు.

వక్ఫ్ బిల్లు ఆమోదంపై నిరసన

విశాలాంధ్ర - కొవ్వూరు రాజమండ్రి : రాజమండ్రి జాంపేట చేపల బజార్ కోళ్ల మార్కెట్ దగ్గర ఉన్న ఆజాద్ చౌక్ లో కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో వక్ఫ్ ఆస్తులకు సంబంధించిన బిల్లును ఆమోదించిన సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నల్ల రిబ్బనులు కట్టుకొని నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. కేంద్రంలో బీజేపీ ఎన్.డి.ఎ కూటమి వక్ఫ్ ఆస్తులకు సంబంధించిన సవరణ బిల్లును పార్లమెంటు ఉభయ సభలలో ఆమోదించడం, ఆమోదించిన తర్వాత రాష్ట్రపతికి పంపడంను నిరసిస్తూ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ టి.కే. విశ్వేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో

కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నల్ల రిబ్బనులు కట్టుకొని నిరసన కార్యక్రమం చేపట్టినారు. ఈ కార్యక్రమంలో సిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అబ్దుల్లా షరీఫ్ కొవ్వూరు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ మహమ్మద్ పాసి వల్లః బేగ్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు సాక పుల్లారావు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మైనింగ్ పెంపునకు ఇంజనీర్లు కృషి చేయాలి

విశాలాంధ్ర - రాజానగరం : భారతదేశ జీడీపీలో మైనింగ్ భాగస్వామ్యం ప్రస్తుతం 2.5 శాతం మాత్రమే ఉందని, దీనిని పెంచవలసిన బాధ్యత యువ ఇంజనీర్ల పై ఉందని ఎంఈఏఐ విశాఖపట్నం చాప్టర్ చైర్మన్ డాక్టర్ రావు అన్నారు. మండలంలోని గోదావరి గ్లోబల్ విశ్వ విద్యాలయంలోని మైనింగ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో మైనింగ్ ఇంజనీర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎంఈఏఐ) స్టూడెంట్ చాప్టర్ ను శుక్రవారం ప్రారంభించారు.దీనిలో భాగంగా ఒకరోజు వర్క్ షాప్ నిర్వ హించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎం ఈఏఐ విశాఖపట్నంచాప్టర్ చైర్మన్ డాక్టర్ సి హెచ్ రావు మాట్లాడుతూ మైనింగ్ పరిశ్రమకు,విద్యాసంస్థ లకు మధ్య వారధిగా ఎంఈఏఐ స్టూడెంట్ చాప్టర్ ఉంటుందని చెప్పారు. విద్యార్థులు ఉద్యోగ అవకాశాలను పెంచుకునే మార్గంలో అప్రెంటీస్ షిప్ వారికి చాలా అవసరమన్నారు. భారతదేశంలోని మైనింగ్ పరిశ్రమంలో విద్యార్థులకు

అప్రెంటీస్ షిప్ అవకాశాలను కల్పించేందుకు కూడా ఈ చాప్టర్ సహకరిస్తుందని అన్నారు. ఎంఈఏఐ సంయుక్త కార్యదర్శి మరియు కోశాధికారి బి సాహా మాట్లాడుతూ ఉక్కు ఉత్పత్తిలో ప్రపంచంలోనే భారతదేశం రెండో స్థానంలో ఉందని చెప్పారు. గోదావరి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ (గైట్) ప్రిన్సిపాల్ డాక్టర్ టి. జయానంద కుమార్, డీన్లు డాక్టర్ బి ప్రభాకర్ రావు, డాక్టర్ ఆర్ఎస్ రాజు, మైనింగ్ విభాగాధిపతి డాక్టర్ వై .వినోద్ కుమార్, ఎం ఈ ఏ ఐ హైదరాబాద్ చాప్టర్ కార్యదర్శి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నాగ అంజలి మృతి బాధాకరం : నాగమణి

విశాలాంధ్ర - కాకినాడ రూరల్ : బొల్లినేని ఆసుపత్రిలో మేనేజర్‌గా పనిచేస్తున్న దీపక్ లైంగిక వేధింపుల కారణంగా ఆత్మహత్యకు పాల్పడిన ఫార్మసీ విద్యార్థినీ నాగంజలి 12 రోజులు మృత్యువుతో పోరాడి మృతిచెందడం ఎంతో విచారకరమని వైసీపీ ఉమ్మడి గోదావరి జిల్లాల మహిళా విభాగం జోనల్ ఇంచార్జ్ జమ్మలమడక నాగమణి అన్నారు. స్థానిక గైగలపాడు నివాసం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నిందితుడు దీపక్‌ను వెంటనే అరెస్టు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. నిందితుడు అధికార పార్టీ ఎమ్మెల్యే బంధువైనంతమాత్రాన నేరస్తుడు కాకుండా పోడని నిందితుడిని తక్షణ అరెస్టు చేసి శిక్ష పడేలా చర్యలు చేపట్టాలని ఆమె డిమాండ్ చేశారు. వైసిపి పార్టీ తరపున బాధిత విద్యార్థిని కుటుంబానికి అండగా ఉంటామని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వారి తల్లిదండ్రులకు హామీ ఇచ్చారని రాజమండ్రి మాజీ ఎంపీ మార్గాని భరత్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, అధికార ప్రతినిధి శ్యామలతో పాటు మహిళా విభాగం జోనల్ ఇన్చార్జిగా తాను బాధితురాలిని పరామర్శించడం జరిగిందన్నారు.

క్రిషీ ట్రాక్టర్ అందజేత

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం మల్లేపల్లి గ్రామంలో శుక్రవారం జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ రూ.లక్ష రాయితీ పై ఎస్ఎమ్ఏఎమ్ పథకంలో క్రిషీ ట్రాక్టర్ నట్టే. వెంకటరమణ అనే రైతుకు వ్యవసాయ శాఖ ద్వారా అందించడం జరిగింది. ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ చిన్న, సన్నకారు రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ దగ్గర చేయడానికి ఈ ప్రభుత్వం కృషి చేస్తుం

దన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు పోతుల మోహనరావు, గ్రామం నాయకులు కాటేపల్లి భద్రరావు, తెలగరెడ్డి భద్రరావు, దిడ్డి శ్రీను, మండల వ్యవసాయ అధికారి సద్గురుమూర్తి, ఏఈఓ చంద్రమౌళి, పాల్గొన్నారు.

రైతులు, ఎంఎస్ఎంఈల మార్కెట్, డిజిటల్ వృద్ధికి ఫ్లిప్‌కార్ట్ సమర్థ్ కృషి

విశాలాంధ్ర-రాజమండ్రి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సొసైటీ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ రూరల్ పావర్టీ (సెర్ప్) సహకారంతో భారతదేశపు స్వదేశీ ఇ -కామర్స్ మార్కెట్ ప్లేస్ అయిన ఫ్లిప్‌కార్ట్, ఫ్లిప్‌కార్ట్ సమర్థ్ కృషి ఒక వర్క్‌షాప్ నిర్వహించింది. ఈ మేరకు సెర్ప్ ఆంధ్రప్రదేశ్‌తో ఫ్లిప్‌కార్ట్ సమర్థ్ కృషి ఒక అవగాహన ఒప్పందం (ఎంఓయూ) చేసింది. ఫ్లిప్‌కార్ట్ గ్రూప్ చీఫ్ కార్పొరేట్ అఫైర్స్ ఆఫీసర్ రజనీష్ కుమార్ మాట్లాడుతూ ఈ సదస్సులో రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్ పీఓలు)కు అవసరమైన మార్కెట్ పరిజ్ఞానం , డిజిటల్ సాధనాలు వారి వ్యాపారాలను విస్తరింప చేయడానికి వ్యూహాలతో సన్నద్ధం చేయడంపై దృష్టి సారించిందన్నారు. ఫ్లిప్‌కార్ట్ ప్రైవేట్ లేబుల్ కిరాణా వ్యాపారానికి సోర్సింగ్ అవకాశాల గురించి వర్క్‌షాప్‌లో చెప్పారు. దీని వలన రైతులు, వ్యవసాయ వ్యాపారాలు జాతీయ మార్కెట్ అవకాశాలను పొందగలుగుతాయన్నారు. ఈ భాగస్వామ్యంలో భాగంగా ఎంఎస్ఎంఈలు, వ్యవసాయ వ్యాపారాలు, రైతు సంఘాలకు వ్యూహాత్మక మార్కెట్ అనుసంధానిత, ఇ కామర్స్ ఏకీకరణకు తోడ్పాటు అందించడం ద్వారా మద్దతు ఇస్తుందన్నారు. ఈ భాగస్వామ్యం రాష్ట్రంలోని చిన్న వ్యాపారాలు, రైతులకు స్థిరమైన వృద్ధి, జీవనోపాధి కల్పన, ఆర్థిక చేరికను అందించటం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. సాంకేతికత ఆధారిత పరిష్కారాల ద్వారా చిన్న వ్యాపారాలు రైతులకు మద్దతు ఇవ్వడం ఫ్లిప్‌కార్ట్ లక్ష్యంలో అంతర్భాగం అని, తాము దృష్టి సారించిన అత్యంత కీలకమైన ప్రాంతాలలో ఆంధ్రప్రదేశ్ ఒకటి అన్నారు. సెర్ప్‌తో భాగస్వామ్యం చేసుకోవడం ద్వారా, వ్యవసాయ వ్యాపారాలు , గ్రామీణ వ్యాపారులకు అవసరమైన సాధనాలు, పరిజానం మరియు డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో వారి పరిధిని విస్తరించడానికి, విజయం సాధించడానికి అవకాశాలను కల్పించడానికి తాము కట్టుబడి ఉన్నామన్నారు.

బాబు జగ్జీవన్‌రామ్ జయంతి

విశాలాంధ్ర - కాకినాడరూరల్ : ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎంఎస్ఎన్ క్యాంపస్‌లో భారత స్వతంత్ర సంగ్రామంలో ప్రధాన పాత్ర పోషించిన బాబు జగ్జీవన్ రామ్ జయంతిని 5న సెలవుదినం కావడంతో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి క్యాంపస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్ ప్రశాంతిశ్రీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ ప్రశాంతిశ్రీ మాట్లాడుతూ, బాబు జగ్జీవన్ రామ్ భారత స్వాతంత్ర్య పోరాటంలో ఎంతో కీలక భూమిక పోషించారన్నారు. అనంతరం బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డా ఎం పోచయ్య, డా ఎం నాని బాబు, డా హారిక, డా మధు కుమార్, డా రామరాజు, మొహమ్మద్ నదీమ్, డా హరి బాబు, డా గోపి, డా శ్రీదేవి, రాధా మాధవి పాల్గొన్నారు.

ఏఎస్సై రమణారెడ్డికి ఎస్సైగా పదోన్నతి

విశాలాంధ్ర - ఆలమూరు : మండల కేంద్రమైన ఆలమూరు పోలీస్ స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్న రమణారెడ్డి ఎస్సైగా పదోన్నతి పొందారు. ఇటీవల ఏలూరు రేంజ్ ఐజి అశోక్ కుమార్ ఉత్తర్వులు మేరకు పదోన్నతి లభించడంతో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ బి కృష్ణారావు రమణారెడ్డిని రావులపాలెం అదనపు ఎస్సైగా నియమించారు. శుక్రవారం రమణారెడ్డి రావులపాలెం అదనపు ఎస్సైగా బాధ్యతలు స్వీకరించారు. స్థానిక ఎస్సై ఎం అశోక్ ఆధ్వర్యంలో ఆలమూరు పోలీస్ స్టేషన్లో వీడ్కోలు సభ ఏర్పాటు చేసి ఆయనను ఘనంగా సత్కరించి అభినందించారు. ఎస్సై అశోక్ మాట్లాడుతూ విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేయకుండా ఉన్నతాధికారుల ఆదేశానుసారం నడుచుకో వాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం రమణారెడ్డి మాట్లాడుతూ ఉద్యోగంలో చేరిన నాటి నుండి ఉన్నతాధికారుల ఆశీస్సులతోనే పదోన్నతులు పొందుతు న్నానని చెప్పారు. పలువురు ఉన్నత స్థాయి అధికారులతో పాటుగా మండల స్థాయి నాయకులు, సిబ్బంది అభినందించారు.

దీపక్‌ను కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర- రాజమహేంద్రవరం రూరల్ : ఒక ఫార్మసీ కాలేజీలో చదువుతూ నగరంలోని ఒక హాస్పిటల్లో ఇంటర్న్‌షిప్ చేస్తున్న విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన జరిగిన నేపథ్యంలో శుక్రవారం ఉదయం నాగం అంజలి మృతికి కారణమైన దీపక్‌ను కఠినంగా శిక్షించాలని ఏఐఎస్ఎఫ్,ఎస్ఎఫ్ఐ డబ్ల్యు నాయకులు డిమాండ్ చేశారు. ముందుగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతలపూడి సునీల్ మాట్లాడుతూ నాగాంజలికి మెరుగైన వైద్య సదుపాయం అందించడంలో ఆసుపత్రి యాజమాన్యం నిర్లక్ష్య ధోరణి చూపించారని ఆయన అన్నారు. మహిళలకు భద్రత కల్పించడంలో కేంద్ర రాష్ట్రాలు విఫలం చెందుతున్నాయని వీటిని అరికట్టే దిశగా కఠిన చట్టాలు తీసుకురావాలని వారు కోరారు. ఈ రాష్ట్రంలో మహిళా హోం మంత్రి అయి ఉండి ఈ ఘటనపై స్పందించకపోవడం చాలా దురదృష్టకరమన్నారు. పోలీసులు కనీసం సిసి టీవీ ఫుటేజ్ ఆధారంగా ఎందుకు విచారణ జరిపించలేదని వారు మండిపడ్డారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే పరిహారం అందించాలని వారి డిమాండ్ చేశారు. లైంగిక వేధింపులకు పాల్పడిన డాక్టర్ దీపక్ ను మూడు నెలల్లోపు శిక్షించాలన్నారు. ఈ తొమ్మిది నెలల కాలంలోనే తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా అధిక మొత్తంలో మహిళలపైన అత్యాయత్నాలు మానభంగాలు జరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి పి లావణ్య ఏ ఐ వై ఎఫ్ జిల్లా కార్యదర్శి పి త్రిమూర్తులు కె శ్రీనివాస్ ఏఐ ఎస్ఎఫ్ జిల్లా నాయకులు మణిరత్నం ఉష జ్యోతి ప్రజ్వలన పాల్గొన్నారు.

నాగాంజలి మరణం బాధాకరం : మాజీ ఎంపీ భరత్

విశాలాంధ్ర- రాజమహేంద్రవరం : నాగాంజలి మరణం అత్యంత బాధాకరమని మాజీ ఎంపీ, వైఎస్ఆర్సిపి రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్ పేర్కొన్నారు. ఆమె మరణవార్త తెలుసుకుని పోస్ట్ మార్టం చేస్తున్న ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్న ఆయన మీడియాతో మాట్లాడుతూ నాగాంజలి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధితురాలు సూసైడ్ నోట్ లో ఏం కోరుకుందో దానిపై తల్లిదండ్రులతో కలిసి పోరాటం చేస్తామన్నారు. దీపక్ కి కఠినాతి కఠిన శిక్ష పడాలని నాగాంజలి కోరుకుందని, అది నెరవేరే విధంగా చర్యలు తీసుకోవాలని భరత్ డిమాండ్ చేసారు. దీపక్ లాంటి కీచకులకు తగిన శిక్ష విధించడం ద్వారా ఇలాంటి ఘటనలు జరక్కుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. నాగాంజలి కుటుంబాన్ని ఆదుకోడానికి ప్రభుత్వం , కిమ్స్ ఆస్పత్రి యాజమాన్యం బాధ్యత తీసుకోవాలని ఆయన డిమాండ్ చేసారు. ప్రభుత్వం ఎక్స్ గ్రేషియా ఇవ్వడంతో పాటు ఆసుపత్రి యాజమాన్యంసాయం అందించాలని భరత్ డిమాండ్ చేసారు. ఈ ఘటనపై హోం మంత్రి కూడా స్పందించకపోవడం బాధాకరమన్నారు.

నాకు న్యాయం చేయండి

విశాలాంధ్ర -రాజమండ్రి సిటీ : రాజమహేంద్రవరం కిమ్స్ హాస్పటల్‌లో చావుబతుకుల మధ్య కొట్టిమిట్టి ఆడుతున్న విద్యార్థినీ అంజలి తండ్రి తీవ్ర ఆవేదనకు గురవుతున్నాడు. తన కూతురు చదువుకుంటానంటే కిమ్స్‌లో జాయిన్ చేసానని, అయితే డాక్టర్ చేతిలో మోసమపోయిన అంజలి పరిస్థితిని చూసి తండ్రి కుమిలిపోతున్నాడు. తమ దంపతులకు పెళ్ళి అయి 13 సంవత్సరాల తరువాత ఒకగాని ఒక కూతురు జన్మించిందని, ఆమెను అలారు ముద్దుగా పెంచుకుంటున్నట్లు బోరున విలపిస్తున్నాడు. తమ ఆశలు నిరాశగా మిగిలిపోయాయనని ఆవేదన చెందుతున్నాడు.శనివారం అంజలి తండ్రిని విశాలాంధ్ర ప్రతినిధి కలవగా తమకు ఇక జీవితంపై ఆశలు పోయాయన్నారు.తమ కూతురే తమకు ప్రాణం అని ఆమె పరిస్థితిని చూస్తే ఏమి చెయ్యాల్లో అర్థం కావడలేదన్నారు. అసలు కిమ్స్ హాస్పటల్‌లో ఏమి జరుగుతుందో తనకు అర్థం కావడంలేదన్నారు. పేదల పిల్లలు చదువుకో కూడదా అంటూ ఆవేదన చెందుతున్నాడు.పేదలకు న్యాయం జరగదా, ఎవరూ పట్టించుకోరా అంటూ భోరున విలపిస్తున్నాడు. కిమ్స్‌లో అంతా డ్రామా జరుగుతుందని, ఎవర్ని నమ్మాలో అర్థం కావడంలేదని అంటున్నాడు. తన కూతురిని చదువు మానిపించి, పెళ్ళి చేసి ఉంటే కనీసం అత్తవారి ఇంటి వద్దనైనా ప్రాణాలతో ఉండేదని విలపిస్తున్నాడు.

అక్రమ తవ్వకాలు పై చర్యలు

విశాలాంధ్ర - రాజానగరం : ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా గ్రావెల్, మట్టి తవ్వకాలు జరిపే వారి పై చర్యలు తప్పవని తూర్పు గోదావరి జిల్లా మైన్స్ అధికారి డి. ఫణి భూషణ్ రెడ్డి అన్నారు. ఇందుకు సంబంధించి పత్రిక ప్రకటన శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలంలోని కొత్త తుంగపాడు గ్రామంలో సర్వే నెం:792 లో అక్రమ గ్రావెల్ త్రవ్వకాలు చేస్తున్నట్లు సమాచారం వచ్చిందని,దీంతో ఆ ప్రాంతాన్ని జిల్లా గనులు మరియు భూ గర్భ , రెవెన్యూ సిబ్బంది సంయుక్తంగా తనిఖీ చేపట్టినట్లు చెప్పారు. అక్రమ గ్రావెల్ త్రవ్వకాలు చేయుచున్న 4 పొక్లైన్లను సీజ్ చేసినట్లు చెప్పారు.

పిఠాపురం అభివృద్ధిపై పవన్ ప్రత్యేక దృష్టి ఉంటుంది

విశాలాంధ్ర - కాకినాడ : పిఠాపురం పట్టణం, జగ్గయ్య చెరువు కాలనీ మహిళలతో ముఖాముఖీలో శాసన మండలి సభ్యులు నాగబాబు పిఠాపురం నియోజకవర్గ అభివృద్ధి, సమస్యల పరిష్కారంపై ఉప ముఖ్య మంత్రి వర్యులు పవన్ కళ్యాణ్‌కి ఎప్పటికీ ప్రత్యేక దృష్టి ఉంటుందని శాసన మండలి సభ్యులు కొణిదెల నాగబాబు భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో ప్రజలకు ఏ చిన్న సమస్య వచ్చినా తక్షణం స్పందించే నాయకుడు పవన్ కళ్యాణ్...అలాంటిది తన సొంత నియోజకవర్గంలో ప్రజలకు ఎలాంటి సమస్య రానివ్వరు..సమస్య ఉంది అంటే పరిష్కారం అయ్యే వరకు వదిలిపెట్టరని స్పష్టం చేశారు. శుక్రవారం సాయంత్రం పిఠాపురం పట్టణ పరిధిలోని జగ్గయ్య చెరువు కాలనీలో మహిళలతో ముఖాముఖీ సమావేశం నిర్వహించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ, తాగునీరు, రోడ్డు సౌకర్యాలు లేక ఏళ్ల తరబడి ఇబ్బందులు పడుతున్నట్టు ఆ ప్రాంతవాసులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ టిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయ కుమార్, కాకినాడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మన్ తుమ్మల బాబు, జనసేన పార్టీ సమన్వయకర్త మర్రెడ్డి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు, పిఠాపురం మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణ పనులు పరిశీలన

విశాలాంధ్ర-భీమడోలు: ప్రభుత్వ శాఖల నడుమ కొరవడిన సమన్వయలోపంతో భీమడోలు మండలం గుండుగొలను వద్ద ఏలూరు కాలువపై అసంపూర్తిగా నిలిచిన వంతెన నిర్మాణ పనులు కొలిక్కి తీసుకువచ్చే దిశగా ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ దృష్టి సారించారు. భీమడోలు మండలం గుండుగొలను వైపు వెళ్లే ప్రజలు వ్యతిరేక దిశలో జాతీయ రహదారిపై రాకపోకలు సాగిస్తూ తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో గుండుగొలను వద్ద ఏలూరు కాలవపై వంతెన నిర్మాణానికి నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా రూ.3.40 కోట్లు మంజూరు చేసింది.టెండర్ ప్రక్రియ అనంతరం నిర్మాణ పనుల బాధ్యతలు స్వీకరించిన గుత్తేదారు వంతెన నిర్మాణం ప్రారంభించారు. ఏలూరు కాలువపై అనుమతి తీసుకోకుండా, తమ శాఖ మార్గదర్శకాల మేరకు వంతెన నిర్మాణం చేపట్టనందున తక్షణం పనులు నిలిపివేయాలని ఇన్‌ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ ఆఫ్ ఇండియా ఇటీవల ఆదేశాలు జారీ చేసింది. ప్రజలు, నాయకులు సమస్యను ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో క్షేత్రస్థాయిలో పర్యటించి వంతెన నిర్మాణ పనులు నిలిచిపోవడం వల్ల అక్కడి ప్రజలు పడుతున్న ఇబ్బందులు తెలుసుకొని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎంపీ మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఎంపీ మహేష్ కుమార్ ఆదేశాలతో ఎన్.హెచ్.ఎ.ఐ టెక్నికల్ మేనేజర్ సాల్మన్ అన్సోవి, సైట్ ఇంజనీర్ సాయినాథ్, కన్స్ట్రక్టివ్ మేనేజర్ సోమేశ్, ఐడబ్ల్యూఏఐ విజయవాడ డిప్యూటీ డైరెక్టర్ సురేష్ శర్మ, జూనియర్ ఇంజనీర్ ఆర్.లోకేష్, ఎంపీ మహేష్ కుమార్ ఓఎస్డి రాఘవులు, స్థానిక నాయకులు పరిశీలించారు.

కారుణ్య నియామకాలు చేపట్టండి : మన్నవ

విశాలాంధ్ర ఏలూరు: విధి నిర్వహణలో మరణించిన పారిశుధ్య కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలని సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య కోరారు. శుక్రవారం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయంలో విధి నిర్వహణలో మరణించిన పారిశుధ్య కార్మికుల కుటుంబ సభ్యులకు ఉద్యోగ నియమాకాలు చేపట్టాలని కోరుతూ జిల్లా రెవిన్యూ అధికారి వి.విశ్వేశ్వర రావుకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా కృష్ణ చైతన్య మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం ప్రాంతానికి చెందిన ముప్పిడి రాంబాబు పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తూ 2023,కొత్తూరు పిచ్చయ్య 2024లో, భీమడోలు రాంబాబు 2025లో వివిధ కారణాలతో మరణించారని తెలిపారు.వారి కుటుంబ సభ్యులు ఎటువంటి జీవనోపాధి లేక అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ యజమాని తప్ప వారికి వేరే ఆధారం లేదని, ప్రభుత్వం తక్షణ జోక్యం చేసుకొని కుటుంబ సభ్యులకు ఉద్యోగ అవకాశం కల్పించాలని వినతి పత్రం అందజేశారు. ఏఐటీయూసీ ఏలూరు జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే,ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏలూరు జిల్లా అధ్యక్షులు కూనపాముల విగ్నేష్,మృతి చెందిన పారిశుధ్య కార్మికుల కుటుంబాలకు చెందిన సీతారావమ్మ,ముప్పిడి సుధారాణి,భీమడోలు వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

కాకినాడ జిజిహెచ్ అభివృద్ధిపై ఎంపీ ప్రత్యేక దృష్టి

విశాలాంధ్ర - కాకినాడ : ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ప్రజలకు ఆరోగ్య ప్రదాయినిగా పేరుగాంచిన కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి(జిజిహెచ్) వైద్యులు, సిబ్బందితో కలిసి జిజిహెచ్‌ను సందర్శించి సౌకర్యాలపై ఆరా తీసిన ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ తాజాగా పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో భాగంగా శుక్రవారం లోక్ సభ జీరో అవర్లో కాకినాడ జిజిహెచ్ అభివృద్ధిపై ప్రస్తావించారు. అనేక దశాబ్దాలుగా ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ ప్రాణదారంగా నిలవడంతో పాటు భవిష్యత్తు తరాలకు వైద్య నిపుణులను అందిస్తున్న రంగరాయ వైద్య కళాశాలకు బోధనా ఆసుపత్రిగా పనిచేస్తుందని తెలిపారు. కాకినాడ జిజిహెచ్‌లో గత ఏడాది 8 లక్షల మంది ఔట్ పేషెంట్లకు, 70,000 మంది ఇన్ పేషెంట్లకు చికిత్స అందించడంతోపాటు, 45,000 శస్త్ర చికిత్సలు, 7 లక్షల ల్యాబ్ పరీక్షలు నిర్వహించిందని గుర్తు చేశారు. అయితే ఆసుపత్రిలో సాధారణ సేవలతో పాటు, కీలకమైన కార్డియాలజీ, అంకాలజీ, న్యూరో సర్జరీ వంటి ప్రత్యేక విభాగాలు ఉన్నప్పటికీ సిబ్బంది కొరత, ఆధునిక పరికరాల కొరత, సరైన వసతులు లేకపోవడంతో అనేక సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. గతంలో క్యాన్సర్ చికిత్సల్లో రాష్ట్రంలోనే అగ్రగామిగా పేరుగాంచిన కాకినాడ ఆసుపత్రి నేడు వసతుల లేమితో రోగులకు ఆధునిక వైద్యం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాలానుగుణంగా ఆసుపత్రి అభివృద్ధి చెందకపోవడం, సరైన మౌలిక సౌకర్యాలు లేకపోవడంతో వైద్యులపై ఒత్తిడి పెరిగి తద్వారా రోగులకు, వైద్యులకు మధ్య అవాంతరాలు ఏర్పడుతున్నాయని తెలిపారు. దీన్ని అధిగమించి, భవిష్యత్తులో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కాకినాడ జిజిహెచ్‌ను ప్రధానమంత్రి స్వస్థ్య సురక్ష యోజన కింద అభివృద్ధి చేయడంతో పాటు ఆసుపత్రిని సంపూర్ణ క్యాన్సర్ చికిత్స కేంద్రంగా అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. తద్వారా ఆధునిక వైద్యం అందుబాటులోకి వచ్చి పేదలకు మేలు జరుగుతుందన్నారు. కాకినాడ జిజిహెచ్‌లో అన్ని విభాగాలను అభివృద్ధి చేసి, కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దేందుకు సమగ్ర నివేదికతో త్వరలో వ్యక్తిగతంగా కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రిని కలుస్తానని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు.

లింగ నిర్ధారణపై కఠిన చర్యలు : ఆర్డీవో

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఆర్డీవో ఎస్ మల్లిబాబు అధ్యర్యంలో శుక్రవారం వైద్య ఆరోగ్యశాఖ, రెవెన్యూ, లీగల్, స్త్రీ శిశు సంక్షేమం, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి సబ్ డిస్టిక్ లెవెల్ మల్టీ మెంబర్ అప్రోప్రియేట్ అథారిటీ, డివిజన్ స్థాయి పీసీ, పీఎన్‌డీటీ సమన్వయ కమిటీ సమావేశం ఆర్డీవో మల్లి బాబు ఆధ్వర్యంలో డిఐఒ డా కెవి సుబ్బ రాజు మాట్లాడుతూ గర్భస్థ పిండ ఆరోగ్య పర్యవేక్షణకు సంబంధించిన పరీక్షలను లింగ నిర్ధారణకు దుర్వినియోగం కాకుండా అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్లపై నిఘా పెట్టామన్నారు. అల్ట్రాసౌండ్ వైద్య పరీక్షలు లింగ నిర్ధారణకు ఉపయోగించుకోవడం చట్ట రీత్యా నేరమని, డివిజన్ స్థాయిలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించే స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ దిగువ టోల్ ఫ్రీ నెంబర్ (1800 425 3365)కు తెలపాలన్నారు. ఈ జీజీహెచ్ రేడియాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా ఇందిరా శైలజ, డా డి విజయ్ ప్రదీప్, వన్ టౌన్ ఎస్ఐ, సిహెచ్ నరసింహ రావు, కే సింహాద్రి, యూత్ వాలంటరీ ఆర్గనైజేషన్ ఎస్ఐఒ, ఎం శివ కుమార్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు డీఈఆర్ఓ నాగార్జున, పి సత్యవతి పాల్గొన్నారు.